


VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 120 | గురువారం 01 అక్టోబర్ 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## కొత్త సోముల చెరువు అభివృద్ధి పనులకు కోటి రూపాయలు నిధులు మంజూరు

- పనులు ప్రారంభించేందుకు భూమి పూజ చేపట్టిన శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి
- రైతులకు సాగునీరు త్రాగునీరు అందించే విధంగా కూటమిపాలనలో కృషి
- శ్రీశైలం నియోజకవర్గం లో చెరువులు ఆనకట్టలు అభివృద్ధి చేయడమే లక్ష్యం
- రైతన్నల శ్రేయస్సు కోసం పాటుపడే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం



ఆత్మకూరు సెప్టెంబర్ 30 వార్త సాక్ష్యం

మండల పరిధిలోని కొట్టాల చెరువు గ్రామంలో కొత్త సోముల చెరువు అభివృద్ధి పనులు చేపట్టేందుకు శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు ముందుగా ఇరిగేషన్ అధికారులు గ్రామ నాయకులు సచివాలయ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను పూలమాలలతో శాలువులతో ఆహ్వానం పలికారు అనంతరం కోటి రూపాయలు నిధులు మంజూరు చేసిన సందర్భంగా శిలాఫలకాన్ని ప్రారంభించారు. - మిగతా2లో

## జగన్, మమత, పవార్

### కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలన్న మల్లు భట్టి



● కాంగ్రెస్‌ను వీడిన వారంతా వెనక్కి రావాలని పిలుపు ● సీఎం రేవంత్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టీకరణ ● నేతలను కులం కోణంలో చూడకూడదని వ్యాఖ్య ● గ్యారెంటీ పథకాలు ఉచితాలు కావన్న డిప్యూటీ సీఎం

## ఇది పేదలకు జరుగుతున్న పట్టాభిషేకం: సీఎం చంద్రబాబు



వార్త సాక్ష్యం: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతోందని, డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రంలో అభివృద్ధి జెట్ స్పీడ్‌తో పరుగులు పెడుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ, విజయవాడలో 26,401 పేద కుటుంబాలకు ఆయన ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. సోమవారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో 'పేదలకు పట్టాభిషేకం' పేరిట నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. - మిగతా2లో

## 'యూపీలో అన్ని దర్యాప్తులు సీబీఐకే అప్పగించాలా?'



వార్త సాక్ష్యం: ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు దర్యాప్తు నిర్వహించిన తీరుపై సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. పోలీసులు ఇదే పద్ధతిని అనుసరిస్తే.. ఇకపై యూపీలో జరిగే అన్ని దర్యాప్తులను సీబీఐకి అప్పగించడమే మంచిదని జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ సంజీవ్ సచ్‌దేవాలతో కూడిన ధర్మాసనం మౌఖికంగా వ్యాఖ్యానించింది. 'ప్రతి విషయంలోనూ మీకొక స్వార్థపూరిత ఉద్దేశం ఉంటుంది. మీరు కేసులను ఈ విధంగా ముందుకు తీసుకెళ్తే ప్రజలు మిమ్మల్ని ఎలా నమ్ముతారు? ఇలా ఉంటే. ఇక పై దర్యాప్తులన్నింటినీ సీబీఐకి అప్పగించాల్సి ఉంటుంది' అని పేర్కొంది. - మిగతా2లో

## ఎమ్మెల్సీ టికెట్ల పై తీన్మార్ మల్లన్న ఫైర్..



రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్

రెండు స్థానాలు రెడ్లకే ఇచ్చారని తీన్మార్ మల్లన్న విమర్శ

రాష్ట్రంలో బీసీ వాదం లేదని నిరూపించే ప్రయత్నం జరుగుతోందని మండిపాటు

## పేరు మార్చినంత మాత్రాన సిద్ధాంతం, నాయకత్వం మారదు



వార్త సాక్ష్యం: పార్టీ పేరును టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మార్చినంత మాత్రాన తమ సిద్ధాంతం, ఆలోచనా విధానం, నాయకత్వం మారబోవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. "నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే నేను షారుఖ్ ఖాన్ అయిపోతానా?" అని ఆయన ప్రశ్నించారు.

## సుందర్ పిచాయ్‌ను 'మాన్‌స్టర్' అన్న ట్రంప్!

వైట్‌హౌస్‌లో టెక్ దిగ్గజాలతో సమావేశం తర్వాత ఈ వ్యాఖ్యలు

అపారమైన శక్తి ఉండి కూడా సుందర్ తక్కువ ప్రొఫైల్ ఉండటాన్ని ప్రశంసించిన వైనం

ట్రంప్ వ్యాఖ్యలకు పిచాయ్ నుంచి సరదా స్పందన

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై చర్చించేందుకు ఈ సమావేశం



## ఉద్రిక్తతల తర్వాత తొలిసారి.. పాక్‌లో భారత సీనియర్ అధికారి

వార్త సాక్ష్యం: భారత్-పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఒక కీలక పరిణామం చోటు చేసుకుంది. భారత విదేశాంగ శాఖకు చెందిన సీనియర్ దౌత్యవేత్త అలోక్ అమితాభ్ దిమ్రి నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందం పాకిస్థాన్‌లో పర్యటిస్తోంది. ఇస్లామాబాద్‌లో జరుగుతున్న షాం ఘై సహకార సంస్థ (ఎస్సీఓ) సమావేశం లో పాల్గొనేం దుకు ఈ బృందం అక్కడికి వెళ్లింది. - మిగతా2లో



# కొత్త సోముల చెరువు అభివృద్ధి పనులకు కోటి రూపాయలు నిధులు మంజూరు

ముందుగా ఇరిగేషన్ అధికారులు గ్రామ నాయకులు సచివాలయ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను పూలమాలలతో శాలువులతో ఆహ్వానం పలికారు అనంతరం కోటి రూపాయలు నిధులు మంజూరు చేసిన సందర్భంగా శిలాఫలకాన్ని ప్రారంభించారు అనంతరం భూమి పూజ చేసి కొత్త సోముల చెరువు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు అనంతరం గ్రామ ప్రజలతో పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు ప్రజలు ఇచ్చిన సమస్యల్ని వెంటనే అధికారులకు తెలియజేసి పరిష్కరించే విధంగా కృషి చేశారు కూటమి ప్రభుత్వ పాలనలో శ్రీశైలం నియోజకవర్గం లో చెరువులు ఆనకట్టలు ప్రజలకు తాగునీరు సాగునీరు అందించేందుకు కోట్లాది రూపాయల నిధులు ప్రభుత్వం మంజూరు చేస్తుందని కొట్టాల చెరువు గ్రామ ప్రజలకు ఎమ్మెల్యే తెలియజేశారు ప్రస్తుతం శ్రీశైలం నియోజకవర్గం అభివృద్ధి కోసం పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా 3.0 కింద గ్రామాల అభివృద్ధి చేసే విధంగా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుందని వివరించారు రైతులు ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులు ముందుండాలని సూచించారు ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ శ్రీశైలం నియోజకవర్గం ఇంచార్జి మోమిన్ షబానా, విఆర్ఎస్పి ప్రాజెక్టు చైర్మన్ పోచ



మల్లికార్జున రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు శివ ప్రసాద్ రెడ్డి, మండల అధ్యక్షుడు రవీంద్రబాబు, ఆత్మకూరు పట్టణ ప్రధాన కార్యదర్శి, అబ్దుల్లాపురం భాష, టిడిపి సీనియర్ మండల నాయకులు మహానంది రాజేంద్రరెడ్డి, దినకర్ రావు, కొట్టాల చెరువు టిడిపి నాయకులు వెంకటేశ్వర్లు, గ్రామ నాయకులు కార్యకర్తలు ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జగన్, మమత, పవార్ కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలన్న మల్లు భట్టి

వైసీపీ అధినేత జగన్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశాలున్నాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి. జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి కాంగ్రెస్ పార్టీ మాజీ నేతలు తిరిగి సొంత గూటికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వారంతా పార్టీలోకి వస్తే అందరికంటే తానే ఎక్కువ సంతోషిస్తానని అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న భట్టి... జగన్‌తో నేరుగా పనిచేయకపోయినా, పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేసినవారవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నేతలను కులం కోణంలో చూడకూడదని, తామిద్దరం ఐక్యంగా, సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై భట్టి తీవ్ర విమర్శలు చేశారు. తాము చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు బదులుగా తెలంగాణకు కేవలం 43 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉందని ఆరోపిస్తూ... చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఆయన సమర్థించుకున్నారు. ఇవి ఉచితాలు కావని, పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలని స్పష్టం చేశారు.

# ఇది పేదలకు జరుగుతున్న పట్టాభిషేకం: సీఎం చంద్రబాబు

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "విశాఖపట్నంలో 28 వేల మందికి, మంగళగిరిలో 5,800 కుటుంబాలకు ఇప్పటికే పట్టాలు అందజేశాం. ఇప్పుడు విజయవాడలో 26,401 కుటుంబాలకు రూ.28,112 కోట్ల విలువైన 707 ఎకరాల భూములపై పూర్తి హక్కులు కల్పిస్తున్నాం. ఇది పేదల ఆత్మగౌరవానికి మా ప్రభుత్వం చేస్తున్న పట్టాభిషేకం" అని పేర్కొన్నారు. ఇప్పటివరకు మొత్తం 60 వేల కుటుంబాలకు రూ.52 వేల కోట్ల విలువైన భూములను అందించడాన్ని తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "2019-24 మధ్య పాలకులు ప్రతి ఇంట్లో ఆస్తుల వివాదాలు సృష్టించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో ప్రజలను భయాందోళనకు గురిచేశారు. సర్వే రాళ్లపై తమ బొమ్మలు ముద్రించుకోవడం కోసం రూ.800 కోట్ల ప్రజా ధనాన్ని వృథా చేశారు. ఇప్పుడు మేము రాజముద్రతో కూడిన వివాదరహిత పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నాం" అని వెల్లడించారు. పురాణాల్లో యజ్ఞాలకు రాక్షసులు అడ్డుపడినట్లు, తాము చేపడుతున్న ప్రతి అభివృద్ధి పనికి గొడ్డలి పార్టీ అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. అమరావతి నిర్మాణాన్ని అడ్డుకునేందుకు ప్రపంచ బ్యాంకుకు లేఖలు రాయడం, చెరకు తోటలను తగలబెట్టడం వంటి చర్యలకు పాల్పడ్డారని మండిపడ్డారు. సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టి తమ ప్రభుత్వానికి రెండు కళ్లని చంద్రబాబు పునరుద్ఘాటించారు. "పట్టిసీమను అడ్డుకోవాలని చూసినా, పట్టుదలతో పూర్తి చేసి కృష్ణా డెల్టాకు నీరందించాం. వచ్చే ఏడాది నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి గ్రావిటీ ద్వారా నీటిని సరఫరా చేస్తాం. అలాగే రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులను మూడేళ్ల కాలంలో పూర్తి చేస్తాం" అని హామీ ఇచ్చారు.

# సుందర్ పిచాయ్‌ను 'మాన్‌స్టర్' అన్న ట్రంప్!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తనదైన శైలిలో చేసిన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. టెక్ దిగ్గజం గూగుల్, ఆల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్‌ను ఉద్దేశించి ఆయన 'మాన్‌స్టర్' (రాక్షసుడు అనే అర్థంలో) అని వ్యాఖ్యానించడం చర్చనీయాంశమైంది. అయితే, ఇది విమర్శగా కాకుండా, ఆయనకున్న అపారమైన శక్తికి, అదే సమయంలో పెద్దగా ప్రచారంలో ఉండకపోవడాన్ని మెచ్చుకుంటూ చేసిన వింత ప్రశంస కావడం గమనార్హం. వైట్‌హౌస్ వెలుపల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అంశంపై ప్రముఖ టెక్నాలజీ కంపెనీల సీఈఓలతో జరిగిన భేటీ అనంతరం ట్రంప్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా సుందర్ పిచాయ్‌ను మాట్లాడమని ఆహ్వానించి, ఆయన బదులివ్వడం మొదలుపెట్టగానే మధ్యలో అడ్డుకున్నారు. "మీకు వీళ్లెవరో తెలియదు. వీళ్లు ప్రపంచంలోనే అతిపెద్ద వ్యక్తులు. ఈయన ఒక మాన్‌స్టర్. కానీ, ఈ విషయం ఎవరికీ తెలియదు. ఎంత గొప్ప జీవితం! ఒక మాన్‌స్టర్‌గా ఉండి కూడా ఇలాంటి ఇబ్బందులు (మీడియాను ఉద్దేశించి) పడాల్సిన అవసరం లేదు. మీరందరూ తెలుసుకోవాల్సింది ఒక్కటే... సుందర్! అతని పేరు సుందర్" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలకు సుందర్ పిచాయ్ ఏమాత్రం తడబడకుండా సరదాగా స్పందించారు. "'నేనొక మాన్‌స్టర్‌ని' అనే ట్యాగ్‌లైన్ కంటే మెరుగైనది ఏదైనా దొరుకుతుందని ఆశిస్తున్నాను" అని ఆయన నవ్వుతూ బదులిచ్చారు. ఈ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సాధారణంగా టెక్నాలజీ, కార్పొరేట్ రంగంలో 'మాన్‌స్టర్' అనే పదాన్ని గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ వంటి అతిపెద్ద కంపెనీల అపారమైన శక్తిని, మార్కెట్‌పై వాటికున్న ప్రభావాన్ని వర్ణించడానికి వాడతారు. ట్రంప్ కూడా అదే ఉద్దేశంతో పిచాయ్ శక్తిని ప్రశంసించినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో ఆంత్రోపిక్, ఓపెన్‌ఏఐ, మెటా, మైక్రోసాఫ్ట్, ఎన్విడియా, అమెజాన్ వంటి ఇతర టెక్ దిగ్గజాల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. మొత్తం మీద ఈ ఆసక్తికర సంభాషణ ట్రంప్ విలక్షణమైన శైలిని, సుందర్ పిచాయ్ వంటి టెక్ దిగ్గజాల తెరవెనుక ఉండే అపారమైన శక్తిని ఒకేసారి ప్రపంచానికి చూపినట్టయింది.

### ఉద్రిక్తతల తర్వాత తొలిసారి.. పాక్‌లో భారత సీనియర్ అధికారి

2025 మే నెలలో జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి, ఆ తర్వాత ఇరు దేశాల మధ్య తలెత్తిన సైనిక ఘర్షణల అనంతరం ఒక భారత సీనియర్ అధికారి పాకిస్థాన్‌లో పర్యటించడం ఇదే ప్రథమం. 2026-27 సంవత్సరానికి గాను ఎస్సీఓ దేశాధినేతల మండలికి పాకిస్థాన్ అధ్యక్షత వహిస్తున్న సంగతి తెలిసిందే. పాక్ అధ్యక్షతన జరుగుతున్న తొలి సమావేశం ఇదే కావడం గమనార్హం. అయితే, ఈ పర్యటన కేవలం ఎస్సీఓ కార్యక్రమానికే పరిమితమని, పాకిస్థాన్ అధికారులతో ఎలాంటి ద్వైపాక్షిక చర్చలు జరిపే ప్రణాళిక లేదని భారత అధికార వర్గాలు స్పష్టం చేశాయి. "ద్వైపాక్షిక చర్చలకు ఉగ్రవాద రహిత, సానుకూల వాతావరణం అవసరం. కానీ, ఎస్సీఓ వంటి బహుళపక్ష వేదికల కింద పాకిస్థాన్‌తో కలిసి పనిచేస్తాం" అని ఓ అధికారి తెలిపారు. 2017 నుంచి భారత్, పాకిస్థాన్ ఎస్సీఓలో పూర్తిస్థాయి సభ్య దేశాలుగా ఉన్నాయి. సంబంధాలు దెబ్బతిన్నప్పటికీ, పాకిస్థాన్ ఆతిథ్యమిచ్చిన సమావేశాలకు భారత్ గతంలోనూ హాజరైంది. 2024 అక్టోబర్‌లో జరిగిన ఎస్సీఓ సమావేశం కోసం విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఇస్లామాబాద్‌లో పర్యటించారు. పహల్గామ్ దాడికి ప్రతిస్పందనగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన 16నెలల తర్వాత ఈ తాజా పర్యటన జరుగుతోంది. 'చర్చలు, ఉగ్రవాదం కలిసి సాగవు' అనే తమ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని, ఎస్సీఓ సమావేశానికి హాజరుకావడం ద్వారా ఆ వైఖరి మారదని భారత్ స్పష్టం చేసింది. కాగా,2027లో పాకిస్థాన్ ఇస్లామాబాద్‌లో ఎస్సీఓ దేశాధినేతల శిఖరాగ్ర సమావేశాన్ని నిర్వహించనుంది. ఈ సదస్సుకు ప్రధాని నరేంద్ర మోదీతో సహా సభ్య దేశాల నాయకులందరినీ ఆహ్వానించే అవకాశం ఉంది.

## 'గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం'..

వీబీ జీ రామ్ జీపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు సంబంధించి క్షేత్రస్థాయి పరిస్థితులపై సమీక్ష చేపట్టారు. గ్రామాల్లో పనుల గుర్తింపు, ఉపాధి కల్పన, పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి క్షేత్రస్థాయి సమస్యలపై మంత్రి ఆరా తీశారు. వీబీ జీ రామ్ జీ అమలులో గ్రామ పంచాయతీల పాత్ర, బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. పనుల ఎంపికలో గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఉపాధి పనుల్లో పారదర్శకత, నాణ్యత, జవాబు దారీతనానికి పెద్దపీట అని మంత్రి తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా మండల, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రజలకు ఉపాధి, గ్రామాలకు అభివృద్ధి, వీబీ జీ రామ్ జీ అమలును మరింత పటిష్ఠం చేయాలని మంత్రి సీతక్క దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో 12 వేల మందికిపైగా సర్పంచులతో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మండల, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## 'యూపీలో అన్ని దర్యాప్తులు సీబీఐకే అప్పగించాలా?'

'ప్రతి విషయంలోనూ మీకొక స్వార్థపూరిత ఉద్దేశం ఉంటుంది. మీరు కేసులను ఈ విధంగా ముందుకు తీసుకెళ్తే ప్రజలు మిమ్మల్ని ఎలా నమ్ముతారు?ఇలా ఉంటే.. ఇకపై దర్యాప్తులన్నింటినీ సీబీఐకి అప్పగించాల్సి ఉంటుంది' అని పేర్కొంది. ఫిర్యాదుదారుడు.. నిందితుణ్ని సంఘటనా స్థలంలోనే పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నప్పటికీ.. పోలీసులు మాత్రం అతణ్ని అపరిచిత వ్యక్తిగా ఎఫ్ఐఆర్‌లో చేర్చడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. 'అతణ్ని స్పాట్‌లోనే పట్టుకున్నప్పుడు గుర్తుతెలియని వ్యక్తిగా ఎందుకు నమోదు చేశారు? సంఘటనా స్థలంలోనే పట్టుబడినా.. తెలియని బైక్ అని ఎఫ్ఐఆర్‌లో రాయడమేంటి?' అని ధర్మాసనం నిలదీసింది. కాగా.. పోలీసులు మొదట్నుంచీ ఈ దర్యాప్తును ఏకపక్షంగా నిర్వహించారని పిటిషనర్ ఆరోపించారు. హైకోర్టు జోక్యంతో పోలీసులు నిందితుడి పేరును ఛార్జిషీట్‌లో చేర్చినప్పటికీ.. ఆ తర్వాత అతనికి క్లీన్ చిట్ ఇచ్చారని వివరించారు. బైక్‌ను స్వాధీనం చేసుకున్నప్పుడు దానికి నంబర్ ప్లేట్ లేదని, అయితే దర్యాప్తు సమయంలో దానికి రిజిస్ట్రేషన్ నంబర్‌ను జోడించారని కూడా పేర్కొన్నారు. దీనిపై న్యాయస్థానం స్పందిస్తూ.. పోలీసుల పనితీరుపై తీవ్రంగా మండిపడింది. 'నియమాలను పాటించడం ఒక విషయమైతే, అన్ని హద్దులు దాటడం పూర్తిగా వేరే విషయం.. ఆపై కప్పిపుచ్చడం ఇంకో విషయం. దీని గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. స్పాట్‌లోనే పట్టుబడినా.. నిందితుడి పేరును ఎందుకు ఎఫ్ఐఆర్‌లో ఎందుకు చేర్చలేదు? అంటే పరిస్థితులు మీకు అనుకూలంగా ఉంటే పేరు మార్చవచ్చని, లేదంటే ఇంకొకరి పేరును చేర్చేందుకే ఇలా చేశారా? అక్కడ వ్యవహారమంతా ఇలాగే కొనసాగుతోందా?' అని ప్రశ్నించింది. యూపీ పోలీసులు దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్ కూడా పూర్తిగా నిరాశపరిచిందని అభివర్ణించింది. తదుపరి విచారణకు సంబంధిత పోలీస్ అధికారి వ్యక్తిగతంగా హాజరు కావాలన్న ధర్మాసనం.. ఈ సారి పూర్తిస్థాయి అఫిడవిట్‌ను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించింది.

## ఎమ్మెల్సీ టికెట్ల పై తీన్మార్ మల్లన్న ఫైర్..

తెలంగాణలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించడం రాజకీయంగా వేడి పుట్టించింది. రెండు సీట్లనూ రెడ్డి సామాజిక వర్గానికే కేటాయించడంపై తెలంగాణ రాజ్య అధికార పార్టీ నేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తీవ్ర ఆరోపణలు చేశారు. దీని వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, సీనియర్ నేత జానారెడ్డి నాటకమాడారని సంచలన వ్యాఖ్యలు చేశారు. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ స్థానానికి సామ రామ్మోహన్ రెడ్డిని, నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానానికి రామిరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని కాంగ్రెస్ అభ్యర్థులుగా ప్రకటించింది. దీనిపై మల్లన్న మాట్లాడుతూ... ఈ నిర్ణయం తనకు ఆశ్చర్యం కలిగించలేదన్నారు. "రెడ్ల పార్టీ రెడ్లకు కాకుండా బీసీలకు టికెట్లు ఇస్తేనే ఆశ్చర్యపడాలి" అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌లోని రెడ్లు ఓ నాటకమాడారని, ఈ కేటాయింపుల వెనుక జానారెడ్డితో పాటు మరో టీచర్ ఎమ్మెల్సీ, ఇంకో రెడ్డి నేత కుట్ర ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఇద్దరు అభ్యర్థులు కేవలం 'బలిపశువులు' మాత్రమేనని మల్లన్న అభివర్ణించారు. పార్టీ గెలవడం కాదు, రెడ్లు గెలవాలన్నదే వారి లక్ష్యమని, దీని కోసం బీఆర్ఎస్‌లోని ఒక వ్యక్తితో రహస్య ఒప్పందం కూడా కుదిరిందని ఆరోపించారు. ఈ స్థానాల్లో కాంగ్రెస్‌కు గతంలో కనీసం డిపాజిట్లు కూడా దక్కలేదని, తాను గెలిచిన తర్వాతే అక్కడ ఆ పార్టీకి గుర్తింపు వచ్చిందని గుర్తుచేశారు. ఈ ఎన్నికలు రెడ్లు, వెలమలకు, బీసీలకు మధ్య జరుగుతున్న పోరాటంగా ఆయన అభివర్ణించారు. రాష్ట్రంలో బీసీ వాదం లేదని నిరూపించే ప్రయత్నం జరుగుతోందన్నారు. తమ తెలంగాణ రాజ్య అధికార పార్టీ తరఫున రెండు స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులను నిలబెట్టి గెలిపిస్తామని తీన్మార్ మల్లన్న ధీమా వ్యక్తం చేశారు. తన అభ్యర్థిత్వంపై త్వరలోనే స్పష్టత వస్తుందని తెలిపారు.

## పేరు మార్చినంత మాత్రాన సిద్ధాంతం, నాయకత్వం మారదు

"నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే నేను షారుఖ్ ఖాన్ అయిపోతానా?" అని ఆయన ప్రశ్నించారు. ఇండియా టుడే కాన్‌క్లేవ్‌లో మాట్లాడిన ఆయన, పార్టీ పేరు మార్పుపై వివరణ ఇచ్చారు. తెలుగు సినిమాలు పాన్-ఇండియా స్థాయిలో విజయం సాధిస్తున్నప్పుడు, తెలుగు గడ్డపై పుట్టిన రాజకీయ పార్టీ కూడా జాతీయ స్థాయిలో ఎందుకు విస్తరించకూడదని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించాలనే ఉద్దేశంతోనే పార్టీ పేరు మార్చామని తెలిపారు. రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, కాంగ్రెస్ పాలనపై ప్రజలు పూర్తిగా విసిగిపోయారని ఆయన జోస్యం చెప్పారు. తదుపరి సీఎం కేసీఆరేనని, తాను కాదని ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్‌లపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. మత ప్రాతిపదికన దేశాన్ని విభజించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రజలు పూజించే రాముడు, శివుడి మధ్య తేడాలు సృష్టించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఉద్యోగాల కల్పన, ఎన్నికల హామీల అమలు వంటి ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడమే ఈ రెండు జాతీయ పార్టీల విధానమని విమర్శించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం విశ్వసనీయతపై తీవ్రమైన సందేహాలు తలెత్తుతున్నాయని కేటీఆర్ అన్నారు. ఈసీ పనితీరుపై ఇటీవల ఓ జాతీయ మీడియా చేసిన పరిశోధనలో వెల్లడైన అంశాలు నిజమేనని చాలామంది నమ్ముతున్నారని, దీనిపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉందని, అయితే ప్రధాన ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ యువతతో కలిసి నడవడంలో విఫలమయ్యారని విమర్శించారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
గురువారం 01 అక్టోబర్ 2026

# సంపాదకీయం

## ఎన్నికల కమిషన్ ఎవరికోసం?



'తుపాకీ పోలీసు చేతిలో ఉన్నప్పటికీ దాన్ని ఎవరిపై పేల్చాలో నిర్ణయించే అధికారం పైవాడి చేతుల్లోనే ఉంటుంది' అని ప్రముఖ నవలాకారుడు జార్జి ఆర్వెల్ తన సుప్రసిద్ధ నవల '1984'లో అన్నారు. ఒక భయంకర ఊహాజనిత ప్రపంచం గురించి చిత్రించిన ఆ నవలలో 'థాట్ పోలీస్' అని ఆర్వెల్ నిర్వచించిన వ్యవస్థలో నిర్ణయాలు అమలు చేసేవారు స్వతంత్రంగా ఆలోచించే శక్తిని కోల్పోతారు. పై వాడు ఏది చెబితే అది చేసే రోబోల్లా మారతారు. మన అధికార వ్యవస్థ ఆ సత్యాన్ని ప్రతిబింబిస్తుందనడంలో అతిశయోక్తి లేదు. ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పేరుతో అనేక కీలక నిర్ణయాలు తమకు తెలియకుండా తీసుకున్నారని ఇద్దరు ఎన్నికల కమిషనర్లు తమ కమిషన్‌లో వివిధ విభాగాలకు పంపిన 14 నోట్స్‌ను సెప్టెంబర్ 24న ఇండియన్ ఎక్స్‌ప్రెస్ లీక్ చేసింది. ఈ సంచలన వార్తా కథనంతో ప్రతిపక్షాలకు, బీజేపీని వ్యతిరేకించే అనేక వర్గాలకు ఎక్కడి లేని ఆవేశం పుట్టుకొచ్చింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను దేశద్రోహి అని నిందిస్తూ, ఆయనను ఉరితీయాలని డిమాండ్ చేస్తున్నారు. కొత్తగా ప్రభవించిన కాక్రోచ్ జనతా పార్టీ కూడా దేశవ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చింది. విచిత్రమేమంటే రెండు రోజుల తర్వాత ఇదే ఎన్నికల కమిషన్ తమ నిర్ణయాలన్నీ కలిసికట్టుగా తీసుకున్నామని ప్రకటించింది. ముగ్గురు ఎన్నికల కమిషనర్లు సమావేశమైన ఫొటోను కూడా పత్రికలకు విడుదల చేశారు. అయితే ప్రతిపక్షాలు, బీజేపీ వ్యతిరేక వర్గాలు ఎంత గగ్గోలు సృష్టిస్తున్నా కేంద్రంలో కీలకమైన నిర్ణయాలు తీసుకునే ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా దాని గురించి అంత సీరియస్‌గా ఉన్నట్లు కనపడడం లేదు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో వార్త వచ్చిన సమయానికి మోదీ ఢిల్లీలోని సేవాతీర్థ్‌లో చింతన్ శిబిర్ పేరుతో కేంద్ర కేబినెట్ మంత్రులతో రెండు రోజుల ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. తాము చేపట్టబోయే పాలనా సంస్కరణలు, వికసిత్ భారత్-- 2047కు రోడ్ మ్యాప్‌పై సుదీర్ఘంగా చర్చించారు. ఎక్స్‌ప్రెస్ వార్తపై సెప్టెంబర్ 25న ప్రతిపక్షాలు తీవ్ర ఆందోళనకు ఉపక్రమించాయి. ఆ రోజు దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి అయినందున ప్రధాని మోదీ యువతీ యువకులతో కలిసి భజన్ క్లబ్బింగ్ పేరిట 'అచ్యుతం, కేశవం' 'రాధే రాధే' వంటి భజన గీతాలను ఆలపించారు. స్వయంగా కంజీరా వాయిస్తూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం యూపీ ట్రేడ్ షో, అహ్మదాబాద్‌లో ఎల్ఎన్‌జీ రైలు ప్రారంభం, ఉగ్రవాద నిరోధక సదస్సు తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారే కానీ విపక్షాల ఆందోళన పట్ల ఏ మాత్రం స్పందించలేదు. తమ మధ్య ఎలాంటి విభేదాలూ లేవని ముగ్గురు ఎన్నికల కమిషనర్లు ప్రకటించినంత మాత్రాన దేశంలో ఎన్నికల వ్యవస్థ సక్రమంగా నడుస్తుందని బుద్ధిజీవులు ఎవరూ అనుకునే అవకాశాలు లేవు. ఇద్దరు మాజీ ఎన్నికల కమిషనర్లు లావాసా, రావత్ కూడా 'సర్' అమలవుతున్న తీరును తీవ్రంగా విమర్శించారు. సర్ నిర్వహణకు అనుసరిస్తున్న పద్ధతి రాజ్యాంగ వ్యతిరేకమని, లోపభూయిష్ఠమని లావాసా విమర్శిస్తే... ఎన్నికల కమిషన్ పనిచేస్తున్న తీరు సక్రమంగా లేదని, దాని విశ్వసనీయతపై కారుమేఘాలు కమ్ముకున్నాయని రావత్ అభిప్రాయపడ్డారు. నిజానికి వివిధ విభాగాలకు ఇద్దరు ప్రస్తుత కమిషనర్లు పంపిన నోట్స్ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రతినిధికి ఎలా చేరాయి? ఒక్కో విభాగం నుంచి నోట్స్ సేకరించడం కష్టమని, ఇద్దరు ఎన్నికల కమిషనర్లలో ఏ ఒక్కరో తమ వద్ద ఉన్న అన్ని నోట్స్‌ను లీక్ చేయడం అసాధ్యమని ఎన్నికల సంఘం అంతర్గత వర్గాలు చెబుతున్నాయి. ఏమైనప్పటికీ ఈ ముగ్గురు ఎన్నికల కమిషనర్లు చివరకు అంతా క్షేమమే అన్నట్లుగా పత్రికా ప్రకటన చేసి చేతులు దులుపుకున్నారు. నిజానికి గత మే నుంచి ఆగస్టు వరకు ముఖాముఖి చూసుకుని ఈ ముగ్గురు అధికారులు తమలో తాము సర్దుకుపోయేందుకు ఏ ప్రచ్ఛన్న హస్తం దోహదం చేసిందో ఊహించడం కష్టం కాదు. మొన్నటి వరకూ కాంగ్రెస్ పార్టీ ఒక్కటే ఓట్ల చోరీ గురించి గొంతు చించుకుంటూ ఉండేది. అయితే ఇద్దరు ఎన్నికల కమిషనర్ల నోట్స్ బయటపడ్డాక దేశవ్యాప్తంగా మోదీ వ్యతిరేక శక్తులు వేర్వేరుగా స్పందించడం మొదలుపెట్టాయి. దేశమంతటా యూట్యూబర్లు విస్తృతంగా జ్ఞానేశ్ కుమార్‌ను దుయ్యబట్టడం మొదలుపెట్టారు. ఇంతకూ దేశంలో ఏ వివాదం ఎంతకాలం సాగుతుందో చెప్పలేము. నీట్ పేపర్ లీక్ వివాదం సద్దుమణిగింది. అయోధ్యలోని రామమందిరంలో చందా చోరీ గురించి ఎవరూ మాట్లాడడం లేదు. యూపీఐపై లెవీ చార్జీల గురించి కూడా జరగాల్సినంత చర్చ జరగలేదు. పెట్రోల్‌లో ఇథనాల్ వివాదం ఎప్పుడో తెరమరుగైంది. ఒక వివాదం తర్వాత మరో వివాదం వస్తూ పోతూనే ఉన్నది. పార్లమెంటు సమావేశాలు జరగడం, స్తంభించిపోవడం మామూలయిపోయాయి. ఇప్పుడు ఎన్నికల వ్యవస్థలో జరుగుతున్న అక్రమాల గురించి ఎవరైనా ఎంతకాలం మాట్లాడతారో చెప్పడం కష్టం. అస్మదీయులనే ఎన్నికల కమిషనర్లుగా నియమించే అవకాశం గురించి ఒక న్యాయమూర్తి మాట్లాడితే 'మీరు మాత్రం మీకు నచ్చిన వారిని న్యాయమూర్తులుగా కొలీజియంలో నియమించుకోవడం లేదా?' అని సొలిసిటర్ జనరల్ ప్రశ్నించారు. గతంలో బోఫోర్స్ కుంభకోణం గురించి ప్రతిపక్షాలు దాదాపు రెండేళ్లు తీవ్రంగా ఉద్యమించి చివరికి రాజీవ్ గాంధీ ప్రభుత్వం అధికారం కోల్పోయేలా చేశాయి.

## బుడ్డా ఆశీస్సులతో 5వ వార్డు ఎంపీపీ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా శీలం నాగరాజు ఎన్నిక

ఆత్మకూరు సెప్టెంబర్ 30 వార్త సాక్ష్యం

పట్టణంలోని 5వ వార్డులో ఎంపీపీ పాఠశాలలో నూతన విద్యా కమిటీ ఎన్నికలు ప్రధానోపాధ్యాయురాలు సీ.బీ. మల్లేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఆశీస్సులతో విద్యా కమిటీ చైర్మన్‌గా శీలం నాగరాజు ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా బి. షేకున్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు టీడీపీ నంద్యాల జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి తిమోతి, టీడీపీ రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి నాగూర్ ఖాన్, ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా, టీడీపీ ఆత్మకూరు పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా, టీడీపీ నాయకులు కోయ మున్నా, వార్డు ఇన్‌చార్జి యూసుఫ్, మంగయ్య, పుల్లయ్య తదితరులు సహకరించారు. విద్యా కమిటీ సభ్యులుగా నజీరున్ బీ, హర్షియా, కృష్ణవేణి, రషీదా బీ, వరలక్ష్మి, పవని, ఆశా ప్రవల్లిక, లక్ష్మీ ప్రసన్న, కీర్తిబాయి, నసీమ, సంజీవ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్ శీలం నాగరాజు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు పాఠశాలలో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి కమిటీ సభ్యులతో కలిసి కృషి చేస్తానన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన విద్యా కమిటీ చైర్మన్ శీలం నాగరాజును టీడీపీ నాయకులు శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. వైస్ చైర్మన్ బి. షేకున్‌తో పాటు నూతన కమిటీ సభ్యులను కూడా నాయకులు అభినందించారు. పాఠశాల అభివృద్ధికి నూతన కమిటీ సమష్టిగా కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు రామాదేవి పాల్గొన్నారు.



# దేశ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకం

- వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువత చురుకైన భాగస్వాములుగా ముందుకు రావాలి.
- నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.

నంద్యాల సెప్టెంబర్ 30 వార్త సాక్ష్యం

చదువుతో పాటు నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు సృజనాత్మకతను పెంపొందించుకొని ఉన్నత శిఖరాకు ఎదగాలని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం నంద్యాల మండలం అయ్యలూరు మెట్ట వద్ద ఉన్న ఎస్ వి ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యువజన ప్రతిభ ప్రదర్శన జరిగింది. ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియతో కలిసి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పాల్గొన్నారు. యువజన ఉత్సవాల్లో భాగంగా జానపద నృత్యం, జానపద గీతం, నుక్కడ్ నాటకం, చిత్రలేఖనం, కవితా రచన తదితర పోటీలను నిర్వహించారు. యువత తమ కళా, సాంస్కృతిక ప్రతిభను ప్రదర్శించేలా ఈ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ దేశ ప్రగతిలో యువత కీలక భాగస్వాములని. యువతలోని ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీసి, వారిని దేశాభివృద్ధిలో భాగస్వాములను చేయడమే యువజన ఉత్సవాల ప్రధాన ఉద్దేశమని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. వికసిత్ భారత్ 2047, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని, విద్యతో పాటు నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. రాయలసీమ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న నేపథ్యంలో యువతకు అందుబాటులోకి వస్తున్న ఉద్యోగ, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని



కోరారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని, భవిష్యత్తులో వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆకాంక్షించారు.

# యువ డాక్టర్లపై దేశ భవిష్యత్ ఆధారపడి ఉంది






- నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.

నంద్యాల సెప్టెంబర్ 30 వార్త సాక్ష్యం

యువ వైద్యులపై దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని, మంచి మార్గంలో పయనించి మీరు బాగుపడుతూ, సమాజ బాగుకోసం పనిచేయాలని నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులకు నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి హితబోధ చేశారు. బుధవారం నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో యువత భవిష్యత్ కు భరోసా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ నేను చాలా కళాశాలలకు వెళ్ళాను. ప్రాథమికంగా యువజన కార్యక్రమాలన్నీ అక్కడే జరిగాయి. కాబట్టి, ఈ రోజుల్లో నేను చాలా కళాశాలలకు వెళ్ళాను. సమాజంలో వైద్యుల స్థానం గొప్పది. యువత భవిషత్ కు భరోసా రాష్ట్రవ్యాప్త కార్యక్రమం. సమాజంలో, దేశంలో లేదా భవిష్యత్ తరంలో యువత పోషించే ప్రధాన పాత్ర యువతదే అన్నది అందరికీ తెలిసిన విషయమే. మీరు ప్రధాన పాత్ర పోషిస్తారు. దాదాపు 30 శాతం జనాభా యువత, ప్రతి ముగ్గురు లేదా నలుగురిలో ఒకరు మీరే జనాభాలో కొంత శాతం యువత ఉన్నారు, ఆ తర్వాత ప్రతి ముగ్గురు లేదా నలుగురిలో ఒకరు మీరే. కాబట్టి మీరు ఒక సమూహంగా... నేను మీకు చెప్పాలనుకుంటున్నాను, నా వృత్తిరీత్యా నేను ఒక వైద్యురాలును, మీకు తెలుసా, నేను నా MBBSను మైసూరులో, నా PG MD రేడియాలజీని నెల్లూరులో పూర్తి చేశాను. నా ఫెలోషిప్ కూడా అక్కడే జరిగింది, కాబట్టి ఇదే నా వృత్తి. కాబట్టి, నేను నిజానికి ఇక్కడ రాజకీయ ప్రసంగం చేయడానికి రాలేదు. నేను చెప్పేది ఏమిటంటే, యువత ఇక్కడ ఒక ప్రధాన పాత్ర పోషిస్తుంది. కాబట్టి ఒక సమూహంగా మనం ఎలా మారాలి, మనం ఎలా కొత్తదనాన్ని తీసుకురావాలి, మనం చేసేది అదే, మీ భవిష్యత్తును మార్చగల సత్తా మీకే ఉంది. అవును, విషయం అదే. ఇది జరగాలిఅంటే. కేవలం ప్రతిభ మాత్రమే ముఖ్యం కాదు. ప్రతిభ ముఖ్యం, ప్రస్తుత కాలంలో సాంకేతికత కూడా ముఖ్యం. అలాగే మనం చేసేది ఏమిటంటే, మీ భవిష్యత్తును, మీరు మార్చుకోగలరు, ఇది జరగాలి, కేవలం ప్రతిభ మాత్రమే ముఖ్యం కాదు. ప్రస్తుత కాలంలో సాంకేతికత కూడా ముఖ్యం, అలాగే నాయకత్వం కూడా చాలా ముఖ్యం అని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. నాయకత్వం అంటే కేవలం ఎమ్మెల్యేగానో, ఎంపీగానో, ప్రధానమంత్రిగానో, రాష్ట్రపతిగానో ఉండటం మాత్రమే కాదు. ముఖ్యమైన విషయం ఏమిటంటే, యువతలో ఆ నాయకత్వ లక్షణాలు ఉండాలి. ఆ నాయకత్వ లక్షణాలు లేకుండా మనం ఏమీ చేయలేము. మీకు ఒక ఉదాహరణ ఇస్తాను. నేను నా పీజీ పూర్తి చేశాను. ఆ తర్వాత నాయకురాలు గా, ప్రజా ప్రతినిధి గా ఉంటున్నా అన్నారు. భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం లు యువత భవిష్యత్‌కు భరోసా ఇచ్చే అనేక కార్యక్రమాలు చేస్తున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకువాలని యువ వైద్యులను ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు.

# హైదరాబాద్‌లో అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక మహాసంఘ్

# జాతీయ కార్యనిర్వాహక కమిటీ సమావేశం జయప్రదం చేయండి

- అక్టోబర్ 2 నుండి 4 వరకు అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక మహాసంఘ్
- జాతీయ కార్యనిర్వాహక కమిటీ సమావేశాలు హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు.

హైదరాబాద్ సెప్టెంబర్ 30 వార్త సాక్ష్యం

హైదరాబాద్ మహానగరంలో అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక మహాసంఘ్ జాతీయ కార్యనిర్వాహక కమిటీ సమావేశం జయప్రదం చేసే విధంగా ముందుండాలని తెలియజేశారు అక్టోబర్ 2 నుండి 4 వరకు ఉదయం 9:00 గంటల నుంచి హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ఉన్న జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో జరుగుతాయి. ఈ జాతీయ కార్యనిర్వాహక కమిటీ సమావేశాల్లో భాగంగా అఖిల భారతీయ శిక్షా భూషణ్ సన్మాన సమారోహం అక్టోబర్ 3న సాయంత్రం 5:30 గంటలకు హైదరాబాద్‌లోని నాగోల్ శుభం కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా విద్యా రంగానికి విశేష సేవలు అందించిన ముగ్గురు ప్రముఖులను ప్రతిష్ఠాత్మకమైన శిక్షా భూషణ్' అవార్డుతో సత్కరించనున్నారు. ఎం. జగదీశ్ కుమార్ మాజీ చైర్మన్, యూజీసీ. బి. మహాదేవన్ మాజీ ప్రొఫెసర్ డీన్,బెంగళూరు డి. రామకృష్ణ రావు మాజీ ప్రిన్సిపాల్, విజ్ఞాన విహార విద్యాసంస్థలు. ఈ కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ సహ–సర్కార్యవాహ్ ముకుంద సి. ఆర్. ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఖాదీ=ఖావీ అధ్యక్షులు నారాయణ్‌లాల్ గుప్తా కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామీజీ, కార్యక్రమానికి విచ్చేసి, కార్యక్రమం విజయవంతం కావడానికి తమ ఆశీస్సులు అందించనున్నారు. దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో విద్యావేత్తలు, ఉపాధ్యాయులు మరియు అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారని భావిస్తున్నారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
గురువారం 01 అక్టోబర్ 2026

# భిక్షాటన చేసి నిరసన తెలిపిన వీఆర్ఏలు

**బనగానపల్లె , సెప్టెంబర్ 30**

వీఆర్ఏలు భిక్షాటన చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం నుండి పెట్రోల్ బంకు కూడలి వరకు వీఆర్ఏలు భిక్షాటన చేస్తూ ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 13 రోజులుగా వీఆర్ఏ లు దీక్ష చేస్తున్న ప్రభుత్వం తమ సమస్యలపై పట్టించుకోవడం లేదన్నారు.భిక్షాటన చేపట్టి నిరసన తెలిపారు. తమ సమస్యల తీవ్రతను ప్రభుత్వానికి తెలియజేసేందుకే ఈ నిరసన చేపట్టామని వీఆర్ఏలు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు . ఏపీ వీఆర్ఏల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షులు నారాయణ వీఆర్ఏల సమ్మెకు మద్దతు తెలిపారు. తెలంగాణ తరహాలో పే స్కేలు అమలు చేయాలని, అర్హత కలిగిన వీఆర్ఏలకు 70 శాతం ప్రమోషన్లు కల్పించాలని, నామినీ వీఆర్ఏలకు ఒకేసారి సెటిల్‌మెంట్ ద్వారా నియామక అవకాశం కల్పించాలని, 60 ఏళ్లు పైబడిన వీఆర్ఏల కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి సమస్యలను




పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ సంఘం ఉపాధ్యక్షులు తలారి సుబ్రహ్మణ్యం, నాయకులు కే. హరిబాబు, తలారి ప్రసాద్,తలారి మధుశంకర్, లక్ష్మీకాంత్ ,మహేంద్ర, మనోహర్, వీఆర్ఏలు పాల్గొన్నారు.

# షాది ఖానాకు బీసీ జేఆర్ పేరు తొలగించాలి -మాజీ ఎమ్మెల్యే కాటసాని

**బనగానపల్లె, సెప్టెంబర్ 30**

షాది ఖానాకు బీసీ జేఆర్ పేరును తొలగించాలని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి డిమాండ్ చేశారు బుధవారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాదీ ఖానాకు, షాపింగ్ కాంప్లెక్స్ కు దేశ నాయకుల పేర్లు పెట్టకుండా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేరును పెట్టుకోవడం దారుణం అన్నారు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. 2018లో షాదిఖానకు జీవో నెంబర్ 77 ఇచ్చారని కోటి రూపాయలు నిధులు మంజూరైనట్లు జీవో ఇచ్చారని నిధులు మంజూరు చేయలేదన్నారు.నిధులు మంజూరైనట్లు మంత్రి తెలపడం సమంజసం కాదన్నారు. మంత్రి బిసి నియోజకవర్గాన్ని తను ఒక్కడే అభివృద్ధి చేసినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని, ఎమ్మెల్యేగా ఎన్నికైన ప్రతి ఒక్కరూ నియోజకవర్గ అభివృద్ధి కోసం పనులు చేస్తారని తెలిపారు.తను ఐదు సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గం అభివృద్ధి కోసం కృషి చేశానని తెలిపారు. గ్రామాలలో సిసి రోడ్లు ,సచివాలయాలు, ఆర్ బి కే కేంద్రాలు, హెల్త్ కేంద్రాలు, ఓహెచ్ఆర్ ట్యాంకులు




నిర్మించినట్లు తెలిపారు. పట్టణంలో అండర్ డ్రైనేజీ ఏర్పాటు చేయడం లేదని డ్రైనేజీ కం సిసి రోడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పనుల మంజూరులో, ఎస్టిమేషన్ లో ఎక్కడ అండర్ డ్రైనేజీ అని లేదన్నారు.

# ఆత్మకూరు మార్కెట్ యార్డ్ అభివృద్ధికి రూ”99 లక్షల నిధులు మంజూరు

**- త్వరలోనే అభివృద్ధి పనులు చేపట్టేందుకు కమిటీ ఆమోదం**

**- మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఆదర్శ రైతులకు సన్మానం**

**ఆత్మకూరు సెప్టెంబర్ 30 వార్త సాక్ష్యం**

పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం పాలకవర్గ సమావేశం ఘనంగా నిర్వహించారు. మార్కెట్ చైర్మన్ వి. వెంకట కృష్ణ రెడ్డి, ఉపాధ్యక్షులు నజీర్ అహ్మద్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆదర్శ రైతులు వెంకటలక్ష్మి, నారాయణ, ఆదినారాయణ, ఆంజనేయులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి నంద్యాల జిల్లా అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ అధికారి పద్మావతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అనంతరం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో మార్కెట్ యార్డ్ పరిధిలో రూ. 97.99 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆమోదం తెలిపారు. ఈ మేరకు తగిన అనుమతుల కోసం వ్యవసాయ మార్కెటింగ్ కమిషనర్/సంచాలకులకు ప్రతిపాదనలు పంపాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మండల



వ్యవసాయ అధికారి హేమలత, ఉద్యానవన శాఖ అధికారిణి చందన, సింగిల్ విండో చైర్మన్ షబుద్దీన్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు ఆమ్రోజ్, వీరభద్రుడు, లాలమ్మ, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చెంచుగిరి జనులకు ఉచిత స్పర్శదర్శనం





**శ్రీశైల దేవస్థానం సెప్టెంబర్ 30 వార్త సాక్ష్యం**

శ్రీశైల దేవస్థానంలో ప్రతీ నెలలోనూ ఒకరోజున అనగా ప్రతీ నెలలో చివరి బుధవారం రోజున చెంచుగిరిజనులకు ప్రత్యేకంగా ఉచిత స్పర్శదర్శనం కల్పించాలని నిర్ణయించడం జరిగింది. ఇందులో భాగంగా ఈ రోజు 259 మంది చెంచు గిరిజన భక్తులకు శ్రీస్వామివార్ల ఉచిత స్పర్శదర్శనం మరియు అమ్మవారి దర్శనం కల్పించబడింది. స్థానిక చెంచుగూడెములతో పాటు నంద్యాల జిల్లా నుంచి 45 మంది, మార్కాపురం జిల్లాలోని 104 మంది చెంచు భక్తులు, మాచర్ల నుండి 110 మంది చెంచు గిరిజనులు స్పర్శదర్శనాన్ని చేసుకోవడం జరిగింది.

దర్శనానంతరం చెంచు గిరిజన భక్తులందరికీ దేవస్థాన అన్నపూర్ణా ప్రసాదవితరణ భవనంలో అన్నప్రసాదాలు ఏర్పాటు చేయబడ్డాయి. కాగా ఈ రోజు ఉదయం చెంచుగిరిజన భక్తులు సంప్రదాయబద్ధంగా తప్పెట వాయిద్యాలతో, చెంచు నృత్యాలతో దర్శనానికి విచ్చేశారు. వారికి ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద సిబ్బంది ఆహ్వానం పలికారు. శ్రీస్వామివారి ఉచిత స్పర్శదర్శనానికి చెంచు గిరిజన భక్తులను ఎంపిక చేయడంలో స్థానిక ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు అధికారి వారి సహకారాన్ని తీసుకోవడం జరిగింది.

# శ్రీ సాక్షిగణపతిస్వామికి విశేష అభిషేకం



**శ్రీశైల దేవస్థానం సెప్టెంబర్ 30 వార్త సాక్ష్యం**

శ్రీశైలంలో లోక కల్యాణం కోసం దేవస్థానం ఈరోజు ఉదయం సాక్షిగణపతిస్వామి వారికి విశేష అభిషేకాన్ని నిర్వహించింది. కాగా ప్రతి బుధవారం, సంకటహరచవితి రోజులు మరియు పౌర్ణమిరోజులలో శ్రీసాక్షిగణపతి వారికి ఈ విశేషఅభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి. ఈ ఉదయం సాక్షిగణపతిస్వామివారికి పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం నిర్వహించబడింది. తరువాత స్వామివారికి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలు జరిపించబడ్డాయి. వైదిక సంప్రదాయాలలో గణపతి అభిషేకానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఈ గణపతి అభిషేకం వలన అనుకున్న పనులలో ఆటంకాలు తొలగి విజయం లభిస్తుందని చెప్పబడుతోంది. అలాగే కోరిన కోరికలు నెరవేరుతాయని, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలుగుతాయని, ముఖ్యంగా విద్యార్థులలో ఆలోచనా శక్తి పెరిగి విద్య బాగా వస్తుందని చెప్పబడుతోంది. కాగా శ్రీశైలక్షేత్ర పరివార ఆలయాలలో సాక్షిగణపతి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. భక్తులు శ్రీశైల మహాక్షేత్రాన్ని సందర్శించినట్లుగా కైలాసంలో పరమేశ్వరుని వద్ద ఈ స్వామి సాక్ష్యం చెబుతాడని ప్రసిద్ధి. అందుకే ఈ స్వామి సాక్షిగణపతిగా పేరొందాడు. చక్కని నల్లరాతితో మలచబడిన ఈ స్వామి ఒకచేతిలో కలం, మరోచేతిలో పుస్తకాన్ని ధరించి భక్తుల పేర్లను నమోదు చేస్తున్నట్లుగా దర్శనమిస్తాడు.

## విద్యాభివృద్ధికి కృషి చేయాలి- బిసి రాజారెడ్డి



**బనగానపల్లె, సెప్టెంబర్ 30**

ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి కొత్తగా ఎన్నికైన విద్యా కమిటీ చైర్మన్ లు ఆయా పాఠశాలల అభివృద్ధితోపాటు విద్యాభివృద్ధికి కృషి చేయాలని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్, అరుణ భారతి సాహితీ సంస్థ అధ్యక్షులు బిసి రాజారెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలోని రాజారెడ్డి కార్యాలయంలో మండలంలోని ఇల్లూరు కొత్తపేటజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గా ఎన్నికైన నషిమూన్, ప్రాథమిక పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గా ఎన్నికైన వలి, మాజీ సర్పంచ్ రామిరెడ్డి ఆధ్వర్యంలో కొత్తగా ఎన్నికైన విద్యా కమిటీ చైర్మన్ లు మర్యాదపూర్వకంగా బిసి రాజారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా బిసి రాజారెడ్డి మాట్లాడుతూ విద్యా కమిటీ చైర్మన్‌లు ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను సమన్వయం చేసుకొని ఆయా పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలన్నారు . రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు ఖర్చుష చేస్తూ విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పిస్తుందన్నారు. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి కోసం కేటాయిస్తున్న నిధులు దుర్వినియోగం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత విద్య కమిటీ చైర్మన్ లపై ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులు చేరేలా చూడాలన్నారు. విద్య ఎంత అభివృద్ధి చెందుతే సమాజం అంత బాగుపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గోధుల సుదర్శన్ రెడ్డి, సురేష్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బాల నాయుడు, చిలకల రాజు, కాసిం, కిట్టు, సుబ్బరామయ్య పాల్గొన్నారు.

## స్వచ్ఛ గ్రామాల నిర్మాణానికి ప్రజలు సహకరించాలి

**-జిల్లా పంచాయతీ అధికారి**



**బనగానపల్లె, సెప్టెంబర్ 30**

స్వచ్ఛ గ్రామాల నిర్మాణానికి ప్రజలు సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్. ఈ.వి. పణి కుమార్ నాయక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నందవరం, నందివర్గం గ్రామాలలో స్వచ్ఛపదంలో భాగంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆర్. ఈ.వి.పణి కుమార్ నాయక్, డిప్యూటీ ఎంపీడీవో బి సురేంద్రనాథ్ యాదవ్ పాల్గొని గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు.స్వచ్ఛ పదంలో భాగంగా క్లాప్ మిత్రులకు( పారిశుధ్య కార్మికులకు) ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి సన్మానించారు.గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించడం, చెత్తను వేరు చేసి సక్రమంగా నిర్వహించడం వంటి అంశాల పై అధికారులు సూచనలు చేశారు. గ్రామాల పరిశుభ్రతకు క్లాప్ మిత్రులు చేస్తున్న సేవలను అధికారులు అభినందించారు. ప్రజలు కూడా పారిశుధ్య కార్యక్రమాల్లో భాగస్వాములై స్వచ్ఛ గ్రామాల నిర్మాణానికి సహకరించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు డి మహేశ్వరయ్య, కె. గురు ప్రసాద్ , స్వర్ణ గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

## వాలీబాల్ టోర్నమెంట్ కు బిసి రాజారెడ్డికి ఆహ్వానం



**బనగానపల్లె, సెప్టెంబర్ 30,**

దసరా పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న వాలీబాల్ ఓపెన్ టోర్నమెంట్ కు రావాలని నిర్వాహకులు బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్, అరుణ భారతి సాహితీ సంస్థ అధ్యక్షులు బిసి రాజారెడ్డి గారిని ఆహ్వానించారు. ఈనెల 2, 3, 4వ తేదీలలో బనగానపల్లె పట్టణ ఆర్టీసీ బస్టాండ్ పక్కన ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నందు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని వారు బిసి రాజారెడ్డి ని ఆహ్వానించారు.

వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
గురువారం 01 అక్టోబర్ 2026

## శ్రీశైల దేవస్థానంలో సాంస్కృతిక కార్యక్రమాలు



శ్రీశైలం దేవస్థానం సెప్టెంబర్ 30 వార్తా సాక్ష్యం

శ్రీశైల దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధనలో) ఈరోజు రాగరమ్య కల్చరల్ ఆర్గనైజేషన్, హైదరాబాదు వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించబడుతున్నది. ఈ కార్యక్రమములో మహాగణపతిం, గణనాయకాయ, శివతాండవం, ఓం శర్వాణి,మూషికవాహన,భో...శంభో, శివతాండవం, శివాష్టకం, తదితర గీతాలకు, అష్టకాలకు మేఘననాగరాజ్, శ్రావణి, శ్రీకృతి, శ్రియ తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నారు. కాగా ఈ నిత్య కళారాధనలో ఆయా రోజులలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామి అమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

## మద్యం దుకాణాల దరఖాస్తుల్లో పారదర్శకత



బండి ఆత్మకూరు సెప్టెంబర్ 30 వార్త సాక్ష్యం

మద్యం దుకాణాల లైసెన్స్ పునరుద్ధరణ, కొత్త దరఖాస్తుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు నోడల్ అధికారి టి. నాగలక్ష్మి తెలిపారు. 80 శాతం లైసెన్సులు పునరుద్ధరించగా రూ.36.32 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. నంద్యాల,కర్నూలు పరిధిలో 27 ఖాళీ దుకాణాలకు ఈ నెల 24 నుంచి అక్టోబర్ 1 అర్ధరాత్రి వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. అక్టోబర్ 5న ఉదయం 8 గంటలకు జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో డ్రానిర్వహిస్తామన్నారు సిండికేట్ల జోక్యాన్ని సహించబోమని , బెదిరింపులు ఎదురైతే జిల్లా అధికారి ఎస్. రవికుమార్‌ను 80088 28467 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఏపీ ఎక్సైజ్ యాప్, ఏఐ ఆధారిత సీసీటీవీలతో నిఘా పెంచుతున్నట్లు నాగలక్ష్మి తెలిపారు

## ఒంటి కాలి పై వీఆర్ఏల నిరవధిక సమ్మె

**– 15వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె.. హామీలు అమలు చేయాలంటూ డిమాండ్**



బండి ఆత్మకూరు సెప్టెంబర్ 30 వార్త సాక్ష్యం

రెండేళ్ల గడిచినా తమ సమస్యలు పరిష్కారం కాలేదంటూ వీఆర్ఏలు వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. బండి ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా బుధవారం వీఆర్ఏలు ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. హామీలు ఇచ్చారు.. రెండేళ్ల గడిచాయి.. కానీ సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదని వీఆర్ఏలు ఆవేదన వ్యక్తం చేశారు. వేతన పెంపు, అర్హులైన వీఆర్ఏలకు పదోన్నతులు తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించాలని డిమాండ్ చేశారు. వీఆర్ఏల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. పెద్దన్న, నంద్యాల జిల్లా అధ్యక్షుడు నారాయణ, బండి ఆత్మకూరు మండల అధ్యక్షుడు బి. శేషు మాట్లాడుతూ.. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతోనే నిరవధిక సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు. తెలంగాణ తరహాలో పే స్కేల్ అమలు చేయడంతో పాటు అర్హులైన వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడం భారంగా మారిందని, పని భారం పెరుగుతున్నా వేతనాలు మాత్రం పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ ప్రధాన డిమాండ్లపై వెంటనే నిర్ణయం తీసుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఆలయ ప్రాంగణములోని వీరభద్రస్వామికి విశేష పూజలు

శ్రీశైల దేవస్థానం సెప్టెంబర్ 30 వార్తా సాక్ష్యం



శ్రీశైలంలో లోకకల్యాణం కోసం దేవస్థానం ఈరోజు సాయంకాలం ఆలయ ప్రాంగణంలోని వీరభద్రస్వామివారికి (జ్వాలా వీరభద్రస్వామి వారికి) విశేష పూజలను నిర్వహిస్తోంది. ఆలయప్రాంగణంలో మల్లికార్జునస్వామివారి ఆలయానికి ఉత్తరభాగంలో మల్లికాగుండానికి ప్రక్కనే ఉన్న వీరభద్రస్వామి జ్వాలామకుటంతో పదిచేతులతో విశిష్టరూపంలో దర్శనమిస్తాడు. శిల్పశాస్త్ర పరిభాషలో ఈ స్వామికి అఘోరవీరభద్రమూర్తి అని పేరు కూడా ఉంది. స్వామివారికి ప్రక్కనే దక్షప్రజాపతి కనిపిస్తాడు. ఈ స్వామిని పరివార ఆలయాలలో భాగంగా ప్రతినిత్యం పూజించడం జరుగుతోంది. కాగా ప్రతి బుధవారం ప్రదోషకాలంలో విశేషఅభిషేకం కార్యక్రమం దేవస్థానం నిర్వహిస్తోంది. ఈ పూజవలన లోకశాంతి, దుర్భిక్షనివారణ, భక్తుల అనుకున్న కోరికలు నెరవేరుతాయి. ముఖ్యంగా క్షేత్ర అభివృద్ధి జరుగుతుంది. కాగా ఈ పూజలలో ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతి పూజను నిర్వహించబడుతుంది. తరువాత వీరభద్రస్వామికి పంచామృతాలతోనూ, పలురకాల ఫలోదకాలతోనూ, గంధోదకం, భస్మోదకం, పుష్పోదకం, బిల్వోదకం, హరిద్రోదకంతోనూ మరియు మల్లికా గుండంలోని శుద్ధజలంతో విశేష అభిషేకం నిర్వహించడం జరుగుతుంది. ఈ అభిషేకాల తరువాత విశేషంగా స్వామివారికి పుష్పార్చనను జరిపించబడుతుంది.

# సీఎం సీఎం సభలకు విద్యార్థి బస్సులు లేక విద్యార్థులు విద్యకు దూరం

**– భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ**

ఆత్మకూరు సెప్టెంబర్ 30 వార్త సాక్ష్యం



పట్టణాలలోని మారుమూల ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు సీఎం సభలకు విద్యార్థి బస్సులు పోవడంతో విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని ఆత్మకూరు మండల కార్యదర్శి కదిరి సాయికుమార్ అధ్యక్షులు ఇస్మాయిల్ అన్నారు ఈ సందర్భంగా బుధవారం ఏపీఎస్ఆర్టీసీ ఆత్మకూరు డిపో సిఐ కోటయ్య నాయక్ విద్యార్థి బస్సుల సమస్యలతో వినతి పత్రం అందజేసి ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ దాదాపు ఆత్మకూరు పట్టణ చుట్టుముట్టు ప్రాంతాలండి ఆత్మకూరు పట్టణంలోని విద్యను అభ్యసించడానికి వస్తున్నటువంటి విద్యార్థులకు వరుసగా సీఎం ప్రోగ్రాం కు విద్యార్థి బస్సులు పోవడంతో విద్యార్థులు విద్యార్థి బస్సు లేక ఇబ్బందులు పడుతున్నారని వారు అన్నారు. మరి కొద్ది రోజుల్లోనే విద్యార్థులకు పరీక్షలు, నిర్వహించాల్సినటువంటి టైంలో విద్యార్థులు విద్యార్థి బస్సు లేక ఇల్ల దగ్గరే ఉండి ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. మరి కొద్ది రోజుల్లో దసరా హాలిడేస్ రావడంతో వరుసగా విద్యార్థులు విద్యకు దూరమైనటువంటి అవకాశం ఉందని వారు అన్నారు. ఈ సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి విద్యార్థి బస్సులతో విద్యార్థులకు సమస్యలు లేకుండా విద్యార్థులు విద్యార్థి బస్సులను అందుబాటులో ఉంచాలని వారు కోరారు. వరుసగా నాలుగు రోజుల పాటు ముఖ్యమంత్రి సభలకు విద్యార్థి బస్సులు పోవడంతో పాటు పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ముఖ్యంగా విద్యార్థినీలు చాలా సమస్యలు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఉన్నాయని వారు అన్నారు. ఇలాగే విద్యార్థులకు విద్యార్థి బస్సులు లేక ఇబ్బందులకు గురి చేస్తే గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులందరినీ ఏకం చేసి ఏపీఎస్ఆర్టీసీ డిపోను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల ఎస్ఎఫ్ఐ నాయకులు అక్మల్,వెంకట్ ,అరవింద్ ,తరుణ్, ప్రవీణ్ ,మనోజ్, మారుమూల ప్రాంత విద్యార్థులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులకు 2016 సం!! నుంచి పెండింగ్ లో ఉన్న పిఎఫ్ చెలించాలి

**– 12వ పిఆర్‌సి కమీషన్ ఏర్పాటు చేయాలి**

ఆత్మకూరు సెప్టెంబర్ 30 వార్త సాక్ష్యం



మున్సిపల్ కార్మికులకు పెండింగ్ లో ఉన్న పిఎఫ్ చెలించాలి, 12వ పిఆర్‌సి కమీషన్ ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు నాగన్న, పెద్ద నాగరాజు లు అన్నారు. బుధవారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం దగ్గర మున్సిపల్ కమీషనర్ బేబీ కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు జీతాల పెంపు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు డిఎ, మధ్యంతర భృతి వర్తింప చేయాలన్నారు. రాష్ట్రంలోని 123 మున్సిపాల్టీలలో విధులు నిర్వహిస్తున్న 60 వేలమంది ఉద్యోగులు, కార్మికులు గత 3 ఏళ్ళుగా జీతాల పెంపు కోసం, 12 వ పిఆర్‌సి వేతనాలకోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 12 వ పిఆర్‌సి కమీషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు పిఆర్‌సి జీతాలు, డిఎ, కరువుభత్యం వర్తింపచేయాలని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో సిఐటియు అనుబంధ సంఘం నిర్వహించిన పోరాట ఫలితంగా నాటి ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు పిఆర్‌సి జీతాల చెల్లింపు, డిఎ, ఐఆర్ తో పాటు ఇంజనీరింగ్ కార్మికులకు నైపుణ్యంతో కూడిన జీతాలు చెల్లిస్తామంటూ జీఓ ఆర్‌టి నెం. 1615 ను 2013 లో జారీచేసిందన్నారు. ఈ జీఓ అమలు చేయాలి. గత 11వ పిఆర్‌సి ని రెండేళ్ళ ఆలస్యంగా అమలుచేశారు. ప్రస్తుతం 12 వ పిఆర్‌సి ని ఏర్పాటుచేయడంలేదు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఏళ్ళతరబడి జీతాలు పెరగకపోవడం వల్ల జీవితాంతం నష్టపోతున్నారన్నారు. మరోవైపు టిఎ, డిఎని, మధ్యంతరభృతి మొదలగు సౌకర్యాలు కల్పించి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను ఆదుకోవాలన్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీలో 2016 నుంచి పెండింగ్ లో ఉన్న పి ఎఫ్ మున్సిపల్ కార్మికుల అకౌంట్లో జమ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, మున్సిపల్ కార్మికులు గొడుగు రాజు, సురేష్, వినోద్,రవి, నాగన్న, సువర్ణమ్మ, సామక్క, తదితరులు పాల్గొన్నారు.

# కూటమిపాలనలో.. గ్రామాల అభివృద్ధికి పల్లె పండగ-3.0 కార్యక్రమాలు ప్రారంభం

**– కరివేన గ్రామంలో రూ" 62 లక్షలతో సిసి రోడ్లు డ్రైనేజీ కాలువల నిర్మాణానికి భూమి పూజ**

**– శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి**

ఆత్మకూరు సెప్టెంబర్ 30 వార్త సాక్ష్యం



కూటమి ప్రభుత్వ పాలనలో పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని కరివేన గ్రామంలో రూ 62 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్లు డ్రైనేజీ కాలువల అభివృద్ధికి శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కూటమి నేతల మధ్యలో భూమి పూజ చేశారు ముందుగా టిడిపి గ్రామ నాయకుడు దినకర్ రావు ఆధ్వర్యంలో పూల పుష్పంతో మర్యాదపూర్వకంగా ఆహ్వానం పలికారు అనంతరం నూతన సిసి రోడ్లు డ్రైనేజీ కాలువల అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కూటమిపాలనతోనే సాధ్యమవుతుందని తెలియజేశారు కరివేన గ్రామ అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులతో పల్లె పండుగ 3.0 కింద రహదారులు డ్రైనేజీ కాలువలు ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని వివరించారు ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యురాలు శ్రీశైలం నియోజకవర్గం ఇంచార్జి మోమిన్ షబానా టిడిపి మండల అధ్యక్షుడు రవీంద్ర బాబు మండల సీనియర్ నాయకులు శివ ప్రసాద్ రెడ్డి, ఆత్మకూరు పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం భాష, పట్టణ అధ్యక్షుడు జెట్టి వేణుగోపాల్, జనసేన పార్టీ నాయకులు కర్నాటి శ్రీరాములు టిడిపి పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A9153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# రవితేజను పరామర్శించిన విద్యార్థి సంఘాల నాయకులు

కర్నూలు సెప్టెంబర్ 30 వార్త సాక్ష్యం

కర్నూలు నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లో ఉన్న నారాయణ జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇయర్ బైపీసీ విద్యార్థి రవితేజపై సెకండ్ ఇయర్ విద్యార్థులు దాడి చేసిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దాడిలో గాయపడిన రవితేజ ప్రస్తుతం అంకుర అపెక్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న నేపథ్యంలో విద్యార్థి సంఘాల నాయకులు ఆది, రంగస్వామి, అయ్యన్న, నాగేంద్ర విద్యార్థి సంఘాల నాయకులు ఆసుపత్రికి వెళ్లి రవితేజను పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను రవితేజను అడిగి తెలుసుకున్నారు. అతని ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ, విద్యార్థుల నుంచి వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న నారాయణ జూనియర్ కళాశాల యాజమాన్యం విద్యార్థుల భద్రత, సంక్షేమం విషయంలో తగిన బాధ్యత వహించాలని అన్నారు. కళాశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లు, పర్యవేక్షణ తదితర అంశాలపై సంబంధిత అధికారులు సమగ్రంగా తనిఖీ చేయాలని కోరారు సీసీటీవీ కాలేజీ మొత్తంగా ఉన్న పనిచేస్తున్నట్లు లేదా విద్యార్థిపై దాడి జరగడం వంటి ఘటనలు పునరావృతం కాకుండా కళాశాల యాజమాన్యం తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, విద్యార్థుల మధ్య ర్యాగింగ్ లేదా దాడులకు అవకాశం లేకుండా కఠినమైన పర్యవేక్షణ



ఏర్పాటు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న ఫీజులు, ఇతర ఛార్జీల వివరాలను సంబంధిత అధికారులు పరిశీలించాలని, నిబంధనలకు అనుగుణంగా ఫీజులు వసూలు చేస్తున్నారా లేదా అనే విషయంపై విచారణ జరపాలని కోరారు రవితేజపై దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధిత విద్యార్థికి పూర్తి రక్షణ కల్పించాలని, కళాశాలలో విద్యార్థుల భద్రత మరియు మౌలిక వసతులను మెరుగుపరచి నారాయణ కాలేజ్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పీడీఎస్ యు,-వి, ఆర్ఎస్ఎఫ్ , పి ఎస్ యు ఎంవీస్ నాయకులు డిమాండ్ చేశారు.

## పోషకాహారమే సంపూర్ణ ఆరోగ్యా నికి మూలం-చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్





వార్త సాక్ష్యం 30-09-2026

మున్సిపాలిటీ పరిధి అర్భి నగర్ లోని అంగన్వాడీ కేంద్రంలో పోష ణ్ మాసోత్సవాల్లో భాగంగాపోష కాహార ప్రదర్శన కార్యక్రమం ఘనంగా నిర్వహిం చారు. అంగన్వాడీ టీచర్లు టేబుల్ పై రకరకాల పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలైన తాజా ఆకు కూరలు,గుడ్లు,మునగకాడలు, పప్పు ధాన్యాలు, బాలామృతం, మొలకలు, కూరగాయలను అందంగా ప్రదర్శనగా ఉంచారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా మున్సిపల్ చైర్మన్ తంగళ్ళ పల్లి శ్రీవాణి రవి కుమార్ హాజరై ప్రదర్శనను క్షుణ్ణంగా పరిశీలిం చారు.ఏ ఆహారంలో ఎంతపోషక విలువ ఉంటుందో టీచర్లను అడి గి తెలుసుకున్నారు.చైర్మన్ తంగళ్ళ పల్లి శ్రీవాణి రవి కుమార్ మాట్లాడుతూ.. అర్భి నగర్ లో నిర్వహించిన ఈ పోష కాహార ప్రదర్శన చాలా బాగుంది నేటితరం పిల్లల్లో,మహిళల్లో రక్త హీనత, పోషకాహార లోపం ఎక్కు వగా ఉంటోంది.దీనికి ప్రధానకార ణం జంక్ ఫుడ్ తినడం.మన చు ట్టుపక్కల దొరికే తోటకూర,గోం గూర, మునగాఆకు, గుడ్లు,పప్పు ల్లోనే సంపూర్ణ పోషకాలు ఉన్నా యి.ప్రతి తల్లి తనపిల్లలకురోజూ గుడ్డు,ఆకుకూరలు పెట్టాలి. గర్భిణీలు, బాలింతలు ప్రభుత్వం ఇస్తున్న బాలా మృతం, ఐరన్ మా త్రలు క్రమం తప్పకుండా తీసుకో వాలి. పోషకాహారం తింటేనే ఆరోగ్యకరమైన భవిష్య త్తరం తయారవుతుంది. అర్భి నగర్ అంగన్వా డీ కేంద్రానికి మున్సిపాలిటీ తర పున కావాల్సిన అన్ని వసతులు కల్పిస్తాము అని అన్నారు.పోషకాహార లోపం వల్ల వచ్చే అనారోగ్య సమస్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని,ప్రభు త్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్ వైజర్లు, టీచర్లు,ఆయాలు అర్భి నగర్ స్థానిక మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

# నూనె బాల్ రాజ్‌కు న్యాయ శాస్త్రంలో పీహెచ్‌డీ

-డాక్టర్ ఎన్. బాల్ రాజ్ గా గుర్తింపు
-శాసన సభా ప్రత్యేక హక్కులపై పరిశోధనలు పూర్తి

(న్యూఢిల్లీ సెప్టెంబర్ 30 వార్త సాక్ష్యం )

తెలంగాణ బీజేపీ నేత నూనె బాల్ రాజ్ న్యాయ శాస్త్రంలో డాక్టరేట్ సాధించారు. గురుగ్రామ్‌లోని కేఆర్ యూనివర్సిటీ ఆయన సమర్పించిన పరిశోధ నలను ఆమోదిస్తూ, న్యాయ శాస్త్రంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) పట్టాను అధికారికంగా ప్రకటిం చింది. యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లీగల్ స్టడీస్ పరిధిలో ఆయన పరిశోధన కొనసాగింది. ఆయన పరిశోధనా అంశం “భారతదేశంలో శాసనసభా ప్రత్యేక హక్కులు -- న్యాయవ్యవస్థ స్పందన: ఒక విమర్శనాత్మక అధ్యయనం”. ఈ పరిశోధనకు డాక్టర్ ఆర్తి శర్మ సూపర్‌వైజర్‌గా, ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ (డాక్టర్) ఎన్. వెంకటేశ్వర్లు కో-సూపర్‌వైజర్‌గా వ్యవహరించారు. భారతదేశంలోని శాసనసభా ప్రత్యేక హక్కుల రాజ్యాంగపరమైన పునాది, చారిత్రక పరిణామం, పరిధి, న్యాయవ్యవస్థ స్పందన, సమకాలీన సవాళ్లను ఆయన పరిశోధనలో విమర్శనాత్మకంగా విశ్లేషిం చారు. యునైటెడ్ కింగ్‌డమ్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాల్లో అమలులో ఉన్న శాసనసభా ప్రత్యేక హక్కుల వ్యవస్థలను వివరంగా పరిశీలించారు. డాక్టరల్ వైవా వోస్ ముగింపు సందర్భంగా ఢిల్లీ యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ లా ప్రొఫెసర్ (డాక్టర్) వాగేశ్వరి దేశ్వాల్ నిర్దేశిత విద్యా ప్రక్రియ అనంతరం ఆయన డాక్టరల్ డిఫెన్స్ విజయవంతంగా పూర్తయి నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయనను “డాక్టర్ ఎన్. బాల్ రాజ్”గా ప్రకటించడం జరిగింది అని వెల్లడించారు. తన తొలి విద్యా మార్గద ర్శకురాలైన ప్రొఫెసర్ ఇందర్‌ప్రీత్ కౌర్‌కు బాల్ రాజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సూపర్‌వైజర్ డాక్టర్ ఆర్తి శర్మ, కేఆర్ యూనివర్సిటీ, కో-సూపర్‌వైజర్ ప్రొఫెసర్ (డాక్టర్) ఎన్. వెంకటేశ్వర్లుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేఆర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అనిల్ కుమార్ సైనీ, చైర్ ప్రొఫెసర్ డాక్టర్ మెహ్రాజ్ ఉద్దీన్ మీర్, డీన్ డాక్టర్ కావేరి శర్మ, హెడ్ లైబ్రేరియన్ డాక్టర్ హెలాలుద్దీన్‌తో పాటు అధ్యాపకులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.తెలంగాణలో పుట్టి పెరిగిన బాల్ రాజ్ విద్యార్థి దశ నుంచే ప్రజా, సంస్థాగత కార్యక్రమాలతో అనుబంధం ఏర్పరుచుకున్నారు. 1987లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)తో అనుబంధం ఏర్పరుచుకున్న ఆయన వీ హెచ్ పీ లోనూ పనిచేసారు. అనంతరం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ)తో పాటు పలు విద్యార్థి, సామాజిక సంస్థల కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 1996లో భారతీయ జనతా పార్టీలో చేరి సంస్థాగత, ప్రజాసేవా బాధ్యతల్లో కొనసాగారు. ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పట్టాలు పొందిన ఆయన సుప్రీంకోర్టు, ఢిల్లీ హైకోర్టు, తెలంగాణ హైకోర్టు తదితర న్యాయస్థానాలు, ట్రైబ్యు నళ్లలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. కేంద్రప్ర భుత్వానికి ప్యానెల్ కౌన్సెల్, సీనియర్ ప్యానెల్ కౌన్సెల్‌గా సేవలందించారు. బీజేపీ సంస్థాగత బాధ్య తల్లో భాగంగా తెలంగాణకు సంబంధించిన బాధ్యత లతో పాటు న్యూఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాల యంలో సరల్ కార్యక్రమానికి సంబంధించిన బాధ్య తలు నిర్వహించారు.



సెంట్రల్ బీజేపీ కోఆర్డినేటర్ (తెలంగాణ), సరల్ నేషనల్ ఇన్‌చార్జ్‌గా ఆయన నిర్వహించిన బాధ్యతలు రాష్ట్రపతి భవన్ డిజిటల్ లైబ్రరీ సహా పలు ప్రజా రికార్డుల్లో నమోదయ్యాయి. అందరికీ సమాన అవకాశాలు అనే లక్ష్యంతో స్థాపిం చిన త్రినేత్ర ఫౌండేషన్ ద్వారా విద్య, పరిశోధన, సామాజిక సేవ, వెనుకబడిన వర్గాలకు అవకాశాల కల్పన వంటి కార్యక్రమాలు చేపట్టారు. విద్యాదానం, విద్యా కార్యక్రమాలు, పరిశోధనా కార్యక్రమాలు, సమాజ ఉపయోగ కార్యక్రమాలకు మద్దతు అందిం చారు. విద్యా సంస్థలతో భాగస్వామ్యాలు, విద్యా సదస్సులకు నాలెడ్జ్ పార్ట్‌నర్‌గా కూడా ఫౌండేషన్ వ్యవహరించింది. క్రీడా పరిపాలనలోనూ బాధ్యతలు చేపట్టిన బాల్ రాజ్ 2025 అక్టోబర్‌లో 2025--2028 కాలానికి తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అసోసియేషన్ కొత్త గవర్నింగ్, అపెక్స్ కౌన్సిళ్ల ఏర్పాటులో భాగంగా ఈ నియామకం జరిగింది.బాల్ రాజ్ బహుముఖ ప్రజా ప్రయాణంలో న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ సాధన మరో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. శాసనసభా ప్రత్యేక హక్కులపై ఆయన చేసిన పరిశోధన, న్యాయం, రాజ్యాంగ సంస్థలు, ప్రజా వ్యవహారాలపై ఆయనకున్న అనుభవాన్ని దీర్ఘకాలిక విద్యా అధ్యయనంతో అనుసంధానించింది. ఈ డాక్టరేట్ సాధన కేవలం ఒక విద్యా అర్హత మాత్రమే కాదని, ఎన్నో సంవత్సరాల అధ్యయనం, పరిశోధన, పట్టుదల, మేధోపరమైన కృషి ఫలితంగా ఇది సాధ్యమైందని బాల్ రాజ్ పేర్కొన్నారు. న్యాయం, రాజ్యాంగ పరిపాలనపై తన అధ్యయనాన్ని మరింతగా కొనసాగించేందుకు ఈ విజయం ప్రేరణనిస్తుందని తెలిపారు. తన ప్రయాణంలో తోడుగా నిలిచిన కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, మార్గదర్శకులు, సహచరులు, స్నేహితులు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.న్యాయవృత్తిలో సుప్రీంకోర్టు, హైకోర్టులు, ఇతర న్యాయస్థానాలు, ట్రైబ్యునళ్లలో ప్రాక్టీస్ చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వ ప్యానెల్ కౌన్సెల్, సీనియర్ ప్యానెల్ కౌన్సెల్‌గా బాధ్యతలు నిర్వహించారు. త్రినేత్ర ఫౌండేషన్ వ్యవస్థాపకుడిగా, తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ వైస్ చైర్మన్‌గా, సెంట్రల్ బీజేపీ కోఆర్డినేటర్ (తెలంగాణ), సారల్ నేషనల్ ఇన్‌చార్జ్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

## నరేంద్ర మోడీ 25 సంవత్సరాల సూపరిపాలన సేవా సంకల్పం



ఆత్మకూరు సెప్టెంబర్ 30 వార్త సాక్ష్యం

సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణం లోని అంగన్వాడి సెంటర్లలో అంగన్ మిలన్ సేవా కార్యక్రమనికి బిజెపి పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు శ్రీశైలం నియోజకవర్గం కన్వీనర్ మోమిన్ షబానా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ముందుగా అంగన్వాడీ టీచర్లు మరియు ఆశా వర్కర్లు అందిస్తున్న సేవలను గుర్తించి వారి సేవలకు అంగన్వాడీ టీచర్లు ఆశా వర్కర్లు ఘనంగా సన్మానించారు అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మోమిన్ షబానా మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ 25 సంవత్సరాల పరిపాలనలో దేశ ప్రజలకు సేవా సంకల్పం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి మహిళల ఆత్మగౌరవానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడం జరిగిందని తెలియజేశారు అంగన్వాడి కేంద్రాలలో బాలింతలు గర్భిణీలకు పౌష్టిక ఆహారం కిట్లను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని కోటేశ్వరి సూపర్వైజర్లు అంగన్వాడీ టీచర్లు కార్యకర్తలు ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో పోషణ్ మాసోత్సవ కార్యక్రమం



ఆత్మకూరు సెప్టెంబర్ 30 వార్త సాక్ష్యం

పట్టణంలోని రహమత్ నగర్ అంగన్వాడి కేంద్రంలో బుధవారం పోషణ్ మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ సెంటర్స్ -14 బి.అంగ న్వాడి టీచర్ విజయలక్ష్మి,,20-బి.నీరజ ,3 శాంత కుమారిల ఆధ్వర్యంలో అంగన్వాడి కేంద్రాలలో గర్భిణీ మహిళలకు బాలింతలకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ కోటేశ్వరి, అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ షేహేనాజ్ బేగం, ఐసిడిఎస్ సూపెర్వైజర్. కోమలి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు గర్భవతులకు,బాలింతలకు, పౌష్టిక ఆహారం, పిల్లలకు వాక్సిన్‌ల గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆశవర్కర్స్ శీలం.శాంతి, లింగమ్మ, ఫ్రీ స్కూల్ పిల్లల తల్లులు, అంగన్వాడి టీచర్లు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే లక్ష్యంగా గ్రామీణ వైద్యుల జాతీయ పార్టీ

- స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధం - కొండిశెట్టి సురేష్ బాబు



విజయవాడ, సెప్టెంబర్ 30 వార్త సాక్ష్యం

విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో గ్రామీణ వైద్యుల జాతీయ పార్టీ ఏపీ స్టేట్ ఎలక్షన్ కమిషన్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కొండిశెట్టి సురేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. కోలా విజయ్ శేఖర్ గ్రామీణ వైద్యుల జాతీయ పార్టీ ఏపీ రాష్ట్ర ఎన్నికల కమిషన్ రిజిస్టర్ సర్టిఫికెట్ ఆవిష్కరణ చేసి అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు ఏపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామీణ వైద్యుల జాతీయ పార్టీ పోటీ చేయనున్నట్లు సురేష్ బాబు వెల్లడించారు. పేదలకు ఉచిత వైద్యం, ఉచిత విద్య, ఉపాధి కల్పించడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేం దుకు, వారి అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలు, రైతులకు గిట్టుబాటు ధర, ప్రజలందరికీ అభివృద్ధి ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ వైద్యులు, మీడియా ప్రతినిధుల సమస్యల పరిష్కారానికి కూడా తమ పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఆంజనేయులు ముళ్ళపూడి నాగేశ్వర రావు మౌలాలి మార్కాపురం విశాఖపట్నం గుంటూరు ప్రకాశం జిల్లా ల నుండి సభ్యులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# బిజినెస్

## ఐఫోన్ యూజర్లకు గుడ్ న్యూస్.. భారత్‌లో యాపిల్ పే షురూ




టెక్ దిగ్గజం యాపిల్ ఎట్టకేలకు భారత్‌లో కూడా తన కాంటాక్ట్‌లెస్ చెల్లింపుల వ్యవస్థ యాపిల్ పేను తాజాగా ప్రవేశపెట్టింది. ఇకపై ఐఫోన్, ఐప్యాడ్, యాపిల్ వాచ్ యూజర్లు సులువుగా డిజిటల్ విధానంలో చెల్లింపులు జరపవచ్చు. అయితే, ప్రస్తుతం యాక్సిస్ బ్యాంకు జారీ చేసిన వీసా, మాస్టర్ క్రెడిట్ కార్డులకే యాపిల్ పే సేవలు అందుబాటులో ఉన్నాయి. భవిష్యత్తులో ఇతర బ్యాంకులకు విస్తరిస్తామని యాపిల్ ఉన్నతాధికారి ఒకరు జాతీయ మీడియాకు తెలిపారు. క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు ఆధారిత డిజిటల్ వాలెట్‌గా యాపిల్ పేను ప్రపంచవ్యాప్తంగా జనాలు వినియోగిస్తున్నారు. భవిష్యత్తులో యూపీఐకి ఈ సేవలు అను సంధానం చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రభుత్వ భారత వినియోగదారులు తమ యాపిల్ పేకు అనుమతి ఉన్న కార్డులను జోడించి చెల్లింపులు జరపవచ్చు. 'టెక్‌పై మంచి పట్టు ఉన్న యువత భారత్‌లోఉంది. నగదు రహిత చెల్లింపులవైపు వీరు మొగ్గు చూపుతున్నారు. ప్రైవసీ, సెక్యూరిటీ విషయంలో కూడా కట్టుదిట్టమైన చర్యలు ఉండాలని ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో భారత్‌లో యాపిల్ పే లాంచ్ చేస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది' అని యాపిల్ పే, వాలెట్ విభాగం వైస్ ప్రెసిడెంట్ జెన్నిఫర్ బెయిలీ తెలిపారు.

**పిన్, ఓటీపీల అవసరం లేకుండానే..**

యాపిల్ పేతో యూజర్లు పిన్ లేదా ఓటీపీ లేకుండానే చెల్లింపులు జరపవచ్చు. ఫేస్ ఐడీ లేదా,టచ్ ఐడీ లాంటి బయోమెట్రిక్ ఆథెంటికేషన్‌తో చెల్లింపులు జరపవచ్చు. పేమెంట్ టర్మినల్‌కు సమీపంలో డివైజ్ పెట్టి బయోమెట్రిక్ ఐడీతో ఆథెంటికేట్ చేస్తే సులువుగా పేమెంట్ జరిగిపోతుంది. యూజర్ల కార్డు నెంబర్స్ గోప్యంగా ఉంచడం ఈ ఫీచర్‌కు ఉన్న మరో ప్రత్యేకత. ఈ వ్యవస్థలో కార్డు నెంబర్‌ను యూజర్‌ల డివైజులు, సర్వర్‌లల్లో స్టోర్ చేయడం లేదా వ్యాపారులతో షేర్ చేయడం ఉండదు. ఇందుకు బదులుగా ఎన్‌క్రిప్టిన్ చేసిన ప్రత్యేక డివైజ్ అకౌంట్ నెంబర్‌ను యాపిల్ వినియోగిస్తుంది. ఐఫోన్‌లో యూపీఐ సేవల కోసం మునుపటి వలెనే ఫోన్ పే, గూగుల్ పే వంటివి వినియోగించవచ్చు.

## అక్టోబర్ 2న యూపీఐ సేవలు పని చేస్తాయ్!




యూపీఐ లావాదేవీలపై ప్రతిపాదించిన ఎండీఆర్ ఛార్జీకి వ్యతిరేకంగా అక్టోబర్ 2న చేపట్టాలనుకున్న 'నో యూపీఐ డే' నిరసనను వ్యాపార సంఘాలు విరమించుకున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో బుధవారం జరిగిన సమావేశం తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 20 మంది వ్యాపార ప్రతినిధులు నిర్మలా సీతారామన్‌ను కలిశారు. రూ.2,000కు మించిన మర్చంట్ యూపీఐ లావాదేవీల పై 0.4 శాతం ఫీజు విధించే ప్రతిపాదనపై వారు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ ఛార్జీతో చిన్న, మధ్య తరహా వ్యాపారాల పై భారం పెరుగుతుందని తెలిపారు. డిజిటల్ చెల్లింపుల వినియోగం కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉందని చెప్పారు. చాందినీ చౌక్ ఎంపీ, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్‌వాల్ నేతృత్వంలో ఈ ప్రతినిధి బృందం సమావేశమైంది. ప్రతిపాదిత ఛార్జీ పై స్పష్టత ఇవ్వాలని కోరింది. వ్యాపారుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. సమావేశం తర్వాత ఖండేల్‌వాల్ మాట్లాడుతూ.. కేంద్రంతో చర్చలు సానుకూలంగా జరిగాయని తెలిపారు. వ్యాపారులు లేవనెత్తిన అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తుందన్న భరోసా లభించిందన్నారు. దీంతో అక్టోబర్ 2న తలపెట్టిన నిరసనను ఉపసంహరించుకున్నట్లు చెప్పారు.

## ఐసీఐసీఐ బ్యాంకు సేవల్లో సాంకేతిక అంతరాయం




ప్రముఖ ప్రైవేటు రంగ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ సేవల్లో సాంకేతిక అంతరాయం ఏర్పడింది. దీనివల్ల బ్యాంకు ఖాతాదారులు, ప్రధానంగా మొబైల్ యాప్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లోని కస్టమర్లు ఈ సమస్యపై సోషల్ మీడియా వేదికగా తమ అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం నుంచి ఈ సాంకేతిక సమస్య తలెత్తినట్లు సమాచారం. మొబైల్ యాప్‌లోకి లాగిన్ అవ్వడానికి ప్రయత్నిస్తే, 'కస్టమర్ కేర్‌ను సంప్రదించండి' అనే సందేశం కనిపిస్తోందని పలువురు యూజర్లు పేర్కొంటున్నారు. మొబైల్ బ్యాంకింగ్, లాగిన్ వంటి కీలక సేవలు నిలిచిపోవడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. సాంకేతిక సమస్యలను పర్యవేక్షించే డౌన్‌డిటెక్టర్ సైతం ఐసీఐసీఐ బ్యాంకు సేవలపై ఫిర్యాదులు భారీగా పెరిగాయని ధ్రువీకరించింది. అయితే, పెద్ద సంఖ్యలో ఖాతాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, ఈ అంతరాయంపై ఐసీఐసీఐ బ్యాంక్ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. సమస్యకు గల కారణాలు, సేవలు ఎప్పుడు పునరుద్ధరిస్తారనే విషయం పై స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతానికి ఈ సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రత్యామ్నాయ బ్యాంకింగ్ మార్గాలను ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణాలు.. అభినందించిన ప్రధాని మోదీ!



'అమ్మా.. ప్రధాని నరేంద్ర మోదీ నన్ను స్వయంగా కలుస్తారు. నేను అంత బాగా ఆడతాను'.. అని ఆసియా క్రీడలకు వెళ్లేముందు షూటర్ నీరూ దాండా తన తల్లితో చెప్పిన మాటలివి. ఇప్పుడా మాటను నిలబెట్టుకుంది. ఈ ఏడాది ఆసియా క్రీడల్లో అద్భుత ప్రదర్శనతో చరిత్ర సృష్టించింది. ట్రాప్ షూటింగ్ వ్యక్తిగత విభాగంలో ఫైనల్లో నీరూ.. 30కి 28 హిట్లు సాధించి పసడి పతకం సాధించింది. తద్వారా ఆసియా క్రీడల్లో ట్రాప్ వ్యక్తిగత విభాగంలో గోల్డ్ నెగ్గిన తొలి భారత మహిళగా రికార్డు నెలకొల్పింది. అంతకుముందు మహిళల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లోనూ ఆశిమా అహ్లావత్, మనీషా కీర్‌లతో కలిసి ఆమె రజతం సాధించింది. అంతే కాకుండా.. బుధవారం కైనన్ చెనైతో కలిసి మిక్స్‌డ్ టీమ్ ట్రాప్‌లోనూ బంగారు పతకం గెలుపొందింది. ఫైనల్లో 34 పాయింట్లతో ఆసియా క్రీడల్లో సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ విభాగంలో భారత్‌కు ఇదే తొలి పతకం కావడం విశేషం.

**మోదీ స్పందిస్తూ..**

నీరూ విజయంపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. 'ఆసియా గేమ్స్‌లో ట్రాప్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణ పతకం సాధించిన నీరూ దాండా, కైనన్ చెనైకు అభినందనలు. ఫైనల్లో భారత జోడీ ఆసియా రికార్డు నెలకొల్పి, ఈ విభాగంలో భారత్‌కు తొలి స్వర్ణ పతకాన్ని అందించింది. భారత షూటింగ్‌కు ఇది చిరస్మరణీయ విజయం. ఇద్దరు క్రీడాకారులూ అద్భుతంగా రాణించారు. రానున్న రోజుల్లోనూ వారు ఇలాగే వెలుగొందాలని ఆకాంక్షిస్తున్నాను' అని ఎక్స్‌లో పేర్కొన్నారు మోదీ.

**కష్టాలను అధిగమించి..**

హరియాణాలోని జింద్ జిల్లా సంగత్‌పురాకు చెందిన నీరూ దాండా.. షూటింగ్‌లో అడుగుపెట్టేందుకు తన బంధువు, షూటర్ లక్ష్య షెరోన్ ప్రేరణగా నిలిచాడు. తొలుత అతడి తుపాకీతోనే ప్రాక్టీస్ చేసిన ఆమె.. 2019లో భోపాల్‌లోని మధ్యప్రదేశ్ షూటింగ్ అకాడమీలో చేరి మరింత ముమ్మరంగా సాధన చేయడం ప్రారంభించింది. ఆసియా క్రీడలకు ముందు తీవ్ర అనారోగ్యానికి గురైన ఆమె.. 5 రోజుల పాటు ఆస్పత్రిలోనే ఉండింది. ఆ సమయంలో ద్రవ ఆహార పదార్థాలకే పరిమితమై కొన్ని వారాలపాటు శిక్షణకు దూరమైంది. అయినప్పటికీ పట్టుదలతో కోలుకుని ఆసియా క్రీడలకు వెళ్లింది. తన అద్భుత ప్రతిభతో రెండు స్వర్ణాలతో మెరిసింది. అంతకుముందు ఈ ఏడాది జులైలో ఇటలీలో జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్‌లో అదరగొట్టింది నీరూ. వ్యక్తిగత ట్రాప్ విభాగంలో పసిడి పతకం సాధించిన తొలి భారతీయురాలిగా రికార్డు సృష్టించింది. ఇక.. ఈ సీజన్ ఆసియా క్రీడల్లో తన కుమార్తె స్వర్ణం సాధించిన విషయం నీరూ తల్లి సుదేశ్‌దేవికి వెంటనే తెలియలేదట. ఇంట్లో టీవీ, స్మార్ట్‌ఫోన్ లేకపోవడంతో.. రేషన్ సరకుల కోసం బయటకు వెళ్తుండగా ఓ పాత్రికేయుడు ఫోన్ చేసి ఈ శుభవార్త చెప్పినట్టు తెలుస్తోంది. ఈ సమాచారం తెలియగానే ఆమె చాలా ఆనందించారని సమాచారం.

# స్పోర్ట్స్

## ఆసియా క్రీడల్లో సునీల్ కుమార్ రికార్డ్.. వరుసగా రెండు పతకాలతో..




భారత రెజ్లర్ సునీల్ కుమార్ ఆసియా క్రీడల్లో మరోసారి మెరిశాడు. పురుషుల 87 కేజీల విభాగంలో ఫిలిప్పీన్స్‌కు చెందిన కాలమ్ రాబర్ట్స్‌ను 9-0తో చిత్తుగా ఓడించి కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. దీంతో ఆసియా క్రీడల్లో 2 గ్రీకో-రోమన్ పతకాలు సాధించిన తొలి భారత రెజ్లర్‌గా చరిత్ర సృష్టించాడు. మరోవైపు.. సునీల్ కంచు మోతతో భారత్ పతకాల సంఖ్య 60కి చేరింది. ఇక మ్యాచ్ విషయానికొస్తే.. ఆరంభం నుంచే ఆధిపత్యం ప్రదర్శించాడు సునీల్. ప్రత్యర్థిని రెండుసార్లు తిప్పికొట్టి 4 పాయింట్లు సాధించాడు. ప్రత్యర్థి పాసివిటీ కారణంగా మరో పాయింట్ రావడంతో.. కేవలం 90 సెకన్లలోనే 5-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. ఆ తర్వాతా అదే దూకుడును కొనసాగిస్తూ కీలకమైన త్రోలను విజయవంతంగా పూర్తి చేశాడు. చివరకు 9-0తో ఆధిక్యంతో మ్యాచ్‌ను ముగించాడు. అంతకుముందు సునీల్ తొలి రౌండ్లో తజికిస్థాన్‌కు చెందిన మహమ్మద్ సుల్తాన్‌జోదాపై ఆధిక్యంతో విజయం సాధించాడు. సెమీఫైనల్లో జపాన్ రెజ్లర్ టైజో యోషిడా చేతిలో ఓడాడు. ఆ తర్వాత జరిగిన కాంస్య పతక పోరులో అద్భుతంగా పుంజుకుని భారత్ ఖాతాలో మరో పతకాన్ని చేర్చాడు. గతంలో హాంగ్‌జౌ(చైనా) ఆసియా క్రీడల్లోనూ కాంస్యం మెరిసన సునీల్.. వరుసగా రెండోసారి ఆసియా క్రీడల్లో పతకం సాధించిన తొలి భారత గ్రీకో-రోమన్ రెజ్లర్‌గా రికార్డు నెలకొల్పాడు. గ్రీకో-రోమన్ రెజ్లింగ్‌లో నడుం కింది భాగంలో పట్టు పట్టడం పూర్తిగా నిషేధం. ఫ్రీస్టైల్‌తో పోలిస్తే ఈ విభాగంలో భారత రెజ్లర్లకు అంతగా విజయాలు దక్కలేదు. కానీ.. ఈ విభాగంలో సునీల్ వరుస విజయాలు భారత రెజ్లింగ్‌కు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయి.

# అక్టోబర్ 30న 'క్రేజీ కల్యాణం'.. అనుపమ పెళ్లి సందడి మొదలైందా

అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్ర
బద్రప్ప గజులా దర్శకుడిగా పరిచయం
రెండో పాట ప్రోమో విడుదల
డాక్టర్ నరేశ్ కీలక పాత్ర
సురేశ్ బొబ్బిలి సంగీతం



అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తెలుగు ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'క్రేజీ కల్యాణం' విడుదల తేదీ ఖరారైంది. బద్రప్ప గజులా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా అక్టోబర్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ ఆరో సినిమాస్ బుధవారం ప్రకటించింది. ఈ సందర్భంగా సినిమాలోని రెండో పాట 'అలసెంద్రవంకోలే ఉన్నావే పిల్ల' ప్రోమోను విడుదల చేసింది. ఇటీవల విడుదలైన ఈ సినిమా టీజర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. కీర్తి పాత్రలో అనుపమ పరమేశ్వరన్ కనిపించనుండగా, ఆమె తండ్రి పాత్రను డాక్టర్ నరేశ్ పోషించారు. కూతురి పెళ్లిని ఘనంగా చేయాలని ఆశపడే తండ్రి చుట్టూ టీజర్‌లోని కథ సాగుతుంది. కూతురికి ఎంత బంగారం కావాలన్నా కొనిస్తానని, నచ్చినన్ని చీరలు తీసుకోవచ్చని, స్నేహితులందరినీ పెళ్లికి పిలవొచ్చని ఆయన చెబుతారు. తన కూతురికి మంచి సంబంధం చూడాలనే ప్రయత్నంలో సోదరుడితోనే ఆయన గొడవకు దిగుతారు. అయితే కీర్తికి మాత్రం తనదైన ఆలోచనలు ఉంటాయి. తన తండ్రిలాగే తాను కూడా మొండిదాన్నేనని అమ్మమ్మతో చెప్పే సన్నివేశం టీజర్‌లో నవ్వులు పూయిస్తుంది. దేవుడిని ప్రార్థిస్తూ తన పెద్ద అల్లుడి కంటే పేదవాడైన మరో అల్లుడు తన సోదరుడికి దొరకాలని నరేశ్ కోరుకునే సన్నివేశం కూడా వినోదాన్ని పంచుతుంది. చివర్లో కీర్తి ఓ వ్యక్తిపై ఎండుమిరపకాయలు విసరడం, ఆమెను పెళ్లి చేసుకునేవాడి పని అయిపోయినట్టేనని అతడు అనడం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. బద్రప్ప గజులా ఈ సినిమాతో దర్శకుడిగా తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. అనుపమతో పాటు అఖిల్ రాజ్ ఉద్దేమరి, డాక్టర్ నరేశ్ విజయకృష్ణ, తరుణ్ భాస్కర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. శ్యామ్ దుపాటి ఛాయాగ్రహణం అందిస్తుండగా, సురేశ్ బొబ్బిలి సంగీతం సమకూరుస్తున్నారు. కథ, దర్శకత్వ బాధ్యతలు బద్రప్ప గజులా నిర్వహించగా, శ్రీనివాస రవీంద్ర స్క్రీన్‌ప్లే అందించారు.

# ఓటీటీకి మృణాల్ ఠాకూర్ 'పూజా మేరీ జాన్'



ఓటీటీ ఫ్లాట్ ఫామ్స్ పై ఒక వైపున క్రైమ్ థ్రిల్లర్ జోనర్ కి సంబంధించిన కథలు దూసుకుపోతుంటే, మరో వైపున కోర్టు రూమ్ డ్రామాలు తమ జోరును కొనసాగిస్తున్నాయి. క్రైమ్ ను .. సస్పెన్స్ ను టచ్ చేస్తూ కోర్టు రూమ్ డ్రామాలు ఉండటం ఈ కాన్సెప్ట్ లకు కలిసొస్తుంది. బలమైన కథ .. కథనం కలిగిన కంటెంట్ కి ప్రేక్షకుల నుంచి విశేషమైన ఆదరణ లభిస్తోంది. నిడివి ఎక్కువగా ఉన్నప్పటికీ వాళ్లు ఈ తరహా కంటెంట్ పట్ల ఆసక్తిని కనబరుస్తున్నారు. స్త్రీ ప్రధానమైన పాత్రలతో ఈ తరహా కంటెంట్ రూపొందుతుండటం ప్రత్యేకంగా కనిపిస్తోంది. అలా స్త్రీ ప్రధానమైన రెండు పాత్రల చుట్టూ తిరిగే కథలో ఒక సినిమా రూపొందింది. ఆ సినిమా పేరే 'పూజా మేరీ జాన్'. అక్టోబర్ 2వ తేదీ నుంచి 'జీ 5'లో ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. అందుకు సంబంధించిన అధికారిక ప్రకటన కూడా వచ్చేసింది. ఈ సినిమాలో పూజ పాత్రను మృణాళ్ ఠాకూర్ పోషించారు. ఈ పాత్ర ను కేంద్రబిందువుగా చేసుకునే ఈ కథ నడుస్తుంది. తన స్నేహితుడు చేసిన లవ్ ప్రపోజల్ ను ఆమె సున్నితంగా తిరస్కరిస్తుంది. ఫలితంగా ఆమె ఎలాంటి పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుంది? అనే అంశం చుట్టూ సన్నివేశాలను అల్లుకుంటూ వెళ్లారు. ఇక ఇటీవల కాలంలో ఓటీటీ సినిమాలతో సిరీస్‌లతో హుమా ఖురేషి ఆడియన్స్‌కి మరింత చేరువయ్యారు . అలాంటి ఆమె ఈ సినిమాలో లాయర్ 'సనా' పాత్రను పోషించారు. పూజకి న్యాయం చేయడం కోసం పోరాడే ఒక ధైర్యవంతురాలైన లాయర్ గా ఆమె ఈ పాత్రలో కనిపించనున్నారు. ఈ రెండు పాత్రలు ఈ సినిమాకి రెండు కళ్లుగా చెప్పుకోవలసి ఉంటుంది. నవజోత్ గులాటి దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఓటీటీ ఆడియన్స్ వైపు నుంచి ఎలాంటి రెస్పాన్స్ ను రాబట్టుకుంటుందనేది చూడాలి.

# సత్య, యోగి బాబుల సినిమాకు టైటిల్ ఖరారు.. 'గోల్డెన్ భాగ్యం'!



తెలుగు చిత్రసీమకు చెందిన ప్రముఖ హాస్య నటుడు సత్య, తమిళ స్టార్ కమెడియన్ యోగి బాబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ద్విభాషా చిత్రానికి టైటిల్ ఖరారైంది. ఈ సినిమాకు 'గోల్డెన్ భాగ్యం' అనే పేరును ఖరారు చేస్తూ చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. పవన్ బసమ్మెట్టి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపొందిస్తున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన టైటిల్ రివీల్ గ్లింప్స్ వీడియో ఆకట్టుకుంటోంది. బిర్యానీ, ఇడ్లీలలో ఏది గొప్పదనే అంశంపై తెలుగు, తమిళ వ్యక్తుల మధ్య జరిగే సరదా సంభాషణతో ఈ వీడియో ప్రారంభమవుతుంది. అనంతరం సంప్రదాయ దుస్తుల్లో ఉన్న సత్య, యోగి బాబులను పరిచయం చేశారు. ఈ గ్లింప్స్‌లో సత్య తమిళంలో, యోగి బాబు తెలుగులో సంభాషించడం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇది ప్రేమ, నేరం (క్రైమ్), యాక్షన్ కలగలిసిన పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రమని మేకర్స్ వెల్లడించారు. డ్రీమ్ మూవీ మేకర్స్, నయవాయు చిత్రాల పతాకాలపై నాగార్జున రెడ్డి, పవన్ బసమ్మెట్టి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో జయశ్రీ, అతిరాజ్ కథానాయికలుగా నటిస్తుండగా.. వెన్నెల కిశోర్, సుదర్శన్, కిశోర్ తిరుమల, రోహిణి, తనికెళ్ల భరణి, సునీల్ రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు. బాబ్లు అజు ఛాయాగ్రహణం అందిస్తుండగా, పవన్ సీహెచ్ సంగీతం సమకూరుస్తున్నారు. ఈ ఏడాదిలోనే ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.